J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 42 సంచిక : 41 17.03.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

బీజేపీ టీడీపీ జనసేన

# పొత్తుల పాట్లు.. సర్దుబాట్ల ఫీట్లు!

- 10 పార్లమెంటు సీట్ల కోసం బీజేపీ పట్టు
- 40 అసెంబ్లీ స్థానాలపై జనసేన కన్ను
- సర్దుబాటుకు సిద్ధమవుతున్న టీడీపీ
- ఆచితూచి అడుగేస్తున్న బీజేపీ

***మరో 3 రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో శాసనమండలి ఎన్నికల జాతర ముగియబోతోంది. పూర్తిస్థాయి ఫలితాలు వచ్చేస్తాయి. జగన్ విధానాలపై ఊహించని వ్యతిరేకత ఉంటే తప్ప ఈ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ పెద్దగా లాభపడే అవకాశాలు కనుచూపు మేరకు ఎక్కడా కనిపించడంలేదు. శాసనమండలి ఎన్నికలు జరుగుతున్న సమయంలోనే మంత్రివర్గ మార్పులు, ముందస్తు ఎన్నికలు వంటి పుకార్లు జోరుగా షికారు చేస్తున్నాయి. ఇలాంటి తరుణంలో రాబోవు ఎన్నికలలో చంద్రబాబు వ్యూహం ఎలా వుండబోతోందన్న ఆసక్తి ఇప్పుడు రాజకీయవర్గాలలో వ్యక్తమవుతోంది.***

1995లో మామ నందమూరి తారక రామారావు నుండి కుర్చీ లాక్కున్న తరువాత, చంద్రబాబు సారధ్యంలోని తెలుగుదేశం పోటీ చేసిన రెండుసార్లూ కమలదళం అండదండలతోనే అధికారంలోకి వచ్చిందన్నది ఎవరూ కాదనలేని కఠోర వాస్తవం. గతంలో అధికారంలోకి వచ్చిన 1999, 2014లో కూడా బీజేపీతో పొత్తు పెట్టుకున్నారు. 2014లో అయితే జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్... తెలుగుదేశంకు మద్దతుగా కాలికి హెలికాప్టర్ కట్టుకుని రాష్ట్రమంతా కలియతిరిగారు. టీడీపీకి బీజేపీ ఇచ్చిన మద్దతుకు ఇది అదనం. బాబు అధికారంలోకి వచ్చాక, పవన్ కళ్యాణ్ ఎవరు, బీజేపీ అంటే ఏమిటి అన్నట్టుగా టీడీపీ నేతలు ప్రవర్తించడం అందరికీ తెలిసిందే. గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని 2019ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అండగా నిలవడానికి బీజేపీ కానీ, జనసేన కానీ సుముఖత చూపించలేదు. ఫలితంగా, ఆ ఎన్నికల్లో టీడీపీ 'నిజస్వరూపం' బయటపడింది. 175 స్థానాలకు 23 స్థానాలు మాత్రమే వచ్చాయి. ఇప్పుడు రాష్ట్రంలో టీడీపీ

14లో







## బ్యాలెట్లలో భవిష్యత్



(వివరాలు 3వ పేజీలో)






## శ్రద్ధాంజలి

అవధులు లేని మీ ప్రేమానురాగాలు సదా స్మరణీయం
అనితరసాధ్యమైన మీ భక్తితత్వం సదా ఆచరణీయం
అజరామరమైన మీ కీర్తి చిరస్మరణీయం

మాకు స్ఫూర్తిప్రదాత, మా కుటుంబ అభివృద్ధికి బంగారు బాటలు వేసిన విధాత

**కీ॥శే॥ ఆల్తూరు ఆదినారాయణరెడ్డి గారి**

తృతీయ వర్ధంతి సందర్భంగా
ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

**ఆల్తూరు సులోచనమ్మ** - భార్య

కుమారులు - కోడళ్ళు

**ఆల్తూరు గిరీష్‌రెడ్డి - లత**
**ఆల్తూరు మహేష్‌రెడ్డి - రాధిక**

మనుమలు, మనుమరాలు

**సాహిని, సాయి సంతోష్**
**సాయి నితీష్, సాయి అనీష్**



# తెలుగు పాటకు 'విశ్వ కిరీటం'

## ఎట్టకేలకు కల సాకారం 'నాటు నాటు'కు ఆస్కార్



ఎట్టకేలకు తెలుగోళ్ళ కల సాకారమైంది. ప్రపంచ వేదికపై మన 'నాటు' పాట 'విశ్వకిరీటం' అందుకుంది. తెలుగు పాటకు 'ఆస్కార్' అవార్డు లభించింది. ఈ పాటకు అంతటి అత్యున్నత అవార్డు లభిస్తుందని, లభించాలని తెలుగోళ్ళంతా మనసారా కోరుకున్నారు. అందరూ అనుకున్నట్లే.. 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని 'నాటు నాటు నాటు' అనే పాటకు అందలం దక్కింది. ఆ గొప్ప గౌరవం దక్కించిన 'ఆర్ఆర్ఆర్' చిత్ర బృందానికి 'లాయర్' శుభాభినందనలు.

'స్వర్ణగోళ' పురస్కారం అందుకున్నప్పుడే ఈ గీతానికి 'ఆస్కార్' వస్తుందని ఆశిస్తూ... అమెరికాకు చెందిన **మాధురి ఇంగువ** వ్రాసిన వ్యాసం అప్పుడే సామాజిక మాధ్యమాల్లో సంచలనం సృష్టించింది. ఆ పాటలోని భావాలు ఎంతటి స్ఫూర్తివంతమైనవో గీత రచయిత చంద్రబోస్‌ను సంప్రదించి మరీ ఆమె ఈ వ్యాసం రాశారు. రచయిత్రికి శుభాకాంక్షలు తెలుపుతూ... పాఠకుల కోసం ఆ వ్యాసాన్ని యధాతథంగా అందిస్తున్నాం...

ఈ "స్వర్ణగోళ" పురస్కారం అందుకున్న RRR చిత్ర గీతం నేడు ప్రపంచమంతా ప్రభంజనంలా అన్ని దిక్కులా వినిపిస్తోంది.

ఒక్కసారిగా కోట్లమంది హృదయం కొల్లగొట్టిన పాట – ప్రపంచ వేదిక మీద తొలిసారిగా ఆసియాఖండం నుండి, అందునా మన తెలుగు గడ్డ నుండి దూసుకు వచ్చిన పాట – "గోల్డెన్ గ్లోబ్ 2023 – బెస్ట్ ఒరిజినల్ సాంగ్" అవార్డు కైవసం చేసుకున్న "నాటు నాటు నాటు" పాట. "RRR" చిత్రం కోసం కీరవాణి గారి సంగీత సారథ్యంలో గీత రచయిత చంద్రబోస్ గారు రాసిన అచ్చ తెలుగు జానపద నృత్య గీతం "నాటు నాటు నాటు" పాటని ఇష్టపడని తెలుగువాడు ఉండడు.

"ఇది మన పాట, మన తెలుగుదనం ఉన్న పాట, వీక్షకులు అవాక్కయ్యేలా మన అభిమాన హీరోలు స్టెప్పులు వేసిన పాట. కనక మనకి నచ్చింది. మరి పాశ్చాత్య దేశాలలోని నూట అయిదుగురు జ్యూరీ సభ్యులకు ఎందుకు అంతలా నచ్చింది? లేడీ గాగా, టేలర్ స్విఫ్ట్, రెహానా వంటి ప్రపంచ ప్రఖ్యాత గాయనీమణుల పాటలను వెనక్కి నెట్టి, గోల్డెన్ గ్లోబ్ అవార్డును కైవసం చేసుకొనే అంత గొప్పతనం ఆ పాటలో ఏముంది?"

ఈ విషయాలు ఆయన ద్వారానే తెలుసుకోవాలన్న కుతూహలంతో గీతరచయిత చంద్రబోస్ గారిని సంప్రదించినప్పుడు, ఆ పాటలోని సాంద్రత బోధపడేలా ప్రతివాక్యానికీ అర్థం వివరించి చెప్పారు. ఆయన చెప్పిన అర్థం ఇలా నా వాక్యాల్లో మీ ముందు ఉంచుతున్నాను.

ముందుగా ఆ పాటను ఒక్కసారి ఆసాంతం గమనిద్దాం.

*పొలంగట్టు దుమ్ములోన పోట్లగిత్త దూకినట్టు*
*పోలేరమ్మ జాతరలో పోతరాజు ఊగినట్టు*
*కిర్రు సెప్పులేసుకొని కర్రసాము సేసినట్టు*
*మర్రిసెట్టు నీడలోన కుర్రగుంపు కూడినట్టు*
*ఎర్రజొన్న రొట్టెలోన మిరపతొక్కు కలిపినట్టు*
*నా పాట సూడు*
*నా పాట సూడు*
*నా పాట సూడు*
*నాటు నాటు నాటు నాటు నాటు నాటు వీర నాటు*
*నాటు నాటు నాటు నాటు నాటు నాటు ఊర నాటు*
*నాటు నాటు నాటు పచ్చి మిరపలాగ పిచ్చ నాటు*
*నాటు నాటు నాటు విచ్చు కత్తిలాగ వెర్రి నాటు*
*గుండెలదిరిపోయేలా డండనకర మోగినట్టు*
*సెవులు సిల్లు పడేలాగ కీసుపిట్ట కూసినట్టు*
*ఏలు సిటికలేసేలా యవ్వారం సాగినట్టు*
*కాలు సిందు తొక్కేలా దుమ్మారం రేగినట్టు*
*ఒళ్ళు సెమట పట్టేలా వీరంగం సేసినట్టు*
*నా పాట సూడు*
*నా పాట సూడు*
*నా పాట సూడు*
*నాటు నాటు నాటు నాటు నాటు నాటు... వీర నాటు*
*నాటు నాటు నాటు నాటు నాటు నాటు... ఊర నాటు*
*నాటు నాటు నాటు... గడ్డపారలాగ చెడ్డ నాటు*
*నాటు నాటు నాటు... ఉక్కపోతలాగ తిక్క నాటు*
*భూమి దద్దరిల్లేలా... ఒంటిలోని రగతమంతా రంకెలేసి ఎగిరేలా*
*ఏసేయ్ రో ఎకాఎకీ... నాటు నాటు నాటు... వాహ్... ఏస్కో*
*అరె దుమ్ము దుమ్ము దులిపేలా*
*లోపలున్న పానమంతా దుముకు దుముకులాడేలా*
*దూకెయ్ రో సరాసరి*
*నాటు నాటు నాటు*

ఈ పాట రాయవలసిన నేపథ్యం గురించి దర్శకులు రాజమౌళి గారు గీతరచయిత చంద్రబోస్ గారికి చెప్పినప్పుడు 'ఇది నృత్య ప్రధాన గీతం, సాహిత్యంలో సబ్జెక్ట్ మాత్రం మీ ఇష్టం' అని పూర్తిస్వేచ్ఛని ఇచ్చారుట.

'నృత్య ప్రధాన గీతం కాబట్టి, చిత్రం ప్రకారం వందేళ్ళ క్రితం నాటి కథ కాబట్టి– ఆనాటి పల్లె ప్రజల నృత్యంలో ఉన్న ఊపు, వేగం, నాటుదనం, తెలుగుదనం గురించి ఈనాటి యువతకు అర్థం అయ్యే రీతిలో అచ్చతెలుగు పదాల అల్లికతో ఒక పాట రాయాలి' అని భావించారు చంద్రబోస్ గారు. ఇలాంటి చక్కని సందర్భం, స్వేచ్ఛా దొరికినప్పుల్లా తెలుగు భాషాభిమానాన్ని చాటుకుంటూనే ఉన్నారు ఆయన. ఈ పాటలో అంతర్లీనంగా ఉన్న ఎన్నో అంశాలలో ఒకటి – కథలో రామ్ ఆంధ్రా నించీ, భీమ్ తెలంగాణ నించీ వస్తారు కనక, ఆయా మాండలికాలు కూడా అక్కడక్కడా స్పృశించారు రచయిత. ఇంకా లోతుగా గమనించే కొద్దీ అంతర్లీనంగా ఎన్నో ప్రత్యేకత అంశాలు ఉన్నాయి ఈ పాటలో. అవన్నీ ఈ వ్యాసంలో ముందుకెళ్ళే కొద్దీ సంపూర్ణంగా తెలుస్తాయి. ఈ నాటు పాట ఇప్పటి మాస్ సాంగ్ అనే పదానికి అప్పటి తెలుగు రూపం. అప్పట్లో నాటు – మోటు – మొరటు వంటి అచ్చతెలుగు పదాలు వాడేవారు పల్లెల్లో. ఈ నాటు పాటలో నృత్యం ఎలా ఉండబోతోందో పల్లవిలోనే చెప్పారు కవి.

**"పొలంగట్టు దుమ్ములోన పోట్లగిత్త దూకినట్టు"**

అనడంలో ఒక పల్లె పౌరుషం కనిపిస్తుంది.

**"పోలేరమ్మ జాతరలో పోతరాజు ఊగినట్ట"**

అనడంలో పల్లె సంప్రదాయ నృత్యంలో ఉన్న భక్తి, చిన్న గగుర్పాటుతో పాటు గొప్ప ఊపు, వేగం, పారవశ్యం... తెలీకుండానే పక్కవాడి చేత కూడా కాలు కదిపించే గుణం కనిపిస్తుంది

**"కిర్రు సెప్పులేసుకొని కర్రసాము సేసినట్టు"**

అనడం ఒక కుర్రకారు సాహస విన్యాసాన్ని సూచిస్తుంది.

**"మర్రిసెట్టు నీడలోన కుర్రగుంపు కూడినట్టు"**

అంటే ఒక సంఘటిత యువశక్తికి సూచకం.

**"ఎర్రజొన్న రొట్టెలోన మిరప తొక్కు కలిపినట్టు"**

అనడం ఆనాటి మన వ్యవసాయ సంప్రదాయాన్ని, ఆర్థిక స్థితినీ, ఆహారపుటలవాట్లనీ, అదిచ్చే చేవనీ సూచిస్తుంది.

పల్లవిలో ఆ నాటు నాట్య విన్యాసాలను– ఆనాటి మన సామాజిక అంశాలలోని చేవతో పోల్చారు.

మొదటి చరణంలో... ఆ నృత్యంవల్ల ఒంట్లోని ప్రతీ అంగం ఎలా పూనకాలతో పులకరించిపోతోందో చెప్పారు చంద్రబోస్ గారు.

**"గుండెలదిరిపోయేలా డండనకర మోగినట్టు**
**సెవులు సిల్లు పడేలాగ కీసుపిట్ట కూసినట్టు**
**ఏలు సిటికలేసేలా యవ్వారం సాగినట్టు**
**కాలు సిందు తొక్కేలా దుమ్మారం రేగినట్టు**
**ఒళ్ళు సెమట పట్టేలా వీరంగం సేసినట్టు"**

అనడంలో ఆ పల్లె నాటు నృత్యానికి గుండె అదురు పెరిగి, వేళ్లతో చిటికెలు వేసి, కాలు కదం తొక్కి, ఒళ్ళు చెమట పట్టి ఆపాదమస్తకం పరవశంతో ఊగిపోతుంది అని స్వభావోక్తి అలంకారం స్ఫురించేలా చెప్పారు కవి. ఇక్కడ కీసుపిట్ట గురించి చెప్పుకోవాలి, ఇదేదో పిచ్చుకలాగా కాలగర్భంలో కలిసిపోయిన పిట్ట కాదు, తెలంగాణా మాండలీకంలో కీసుపిట్ట అంటే ఈల వేయడం. ఇది పాతకాలం నాటి పల్లెపదం.

అలాగే రెండో చరణంలోని ఉపమానాలలో కవితాత్మక భావావేశం గోచరిస్తుంది.

**"భూమి దద్దరిల్లేలా... ఒంటిలోని రగతమంతా రంకెలేసి ఎగిరేలా,**
**దుమ్ము దుమ్ము దులిపేలా..**
**లోపలున్న పానమంతా దుముకుదుముకులాడేలా"**

అనడంలో, వేగం హెచ్చిన నాట్యం వల్ల రక్తం అంతా ఎగజిమ్మడాన్ని కూడా రోషంగా, కవితాత్మకంగా...**"రగతమంతా రంకెలేసి ఎగరడం"** అంటూ పౌరుషాన్నీ, పోటీతత్వాన్ని సూచించేలా గొప్పగా భావవ్యక్తీకరణ చేశారు రచయిత. **"లోపలున్న ప్రాణం అంతా ఆవేశంగా ఉప్పొంగింది"** అనే ఉత్ప్రేక్షని తెలంగాణా మాండలీకంలో **"లోపలున్న పానమంతా దుముకు దుముకులాడటం"** అంటూ కవితాత్మకంగా వ్యక్తపరిచారు చంద్రబోస్ గారు. అలాగే, తొక్కు, కీసుపిట్ట, పానం దుముకులాడటం వంటి తెలంగాణ మాండలీకాలనీ, వాటితోపాటే ఆంధ్రా మాండలీకాలనీ కుడా సమానంగా పాటనిండా పొదిగారు రచయిత. కళారూపం ఏదయినా... అది ప్రజల వాడుక మాటల్లో ఉన్నప్పుడే అది అన్ని వర్గాల వారిని చేరి సంపూర్ణత్వం సంతరించుకొని పదికాలాల పాటు నిలబడుతుంది.

ఇంత భావసాంద్రత ఉన్న ఈ పాటను "గోల్డెన్ గ్లోబ్" జ్యూరీలోని సభ్యులయిన దర్శకులు, రచయితలు, విమర్శకులు, సామాన్య శ్రోతలు, విభిన్న విభాగాలకు చెందిన నూటయిదుగురు జడ్జీలు, ఆంగ్లంలోకి అనువదించుకొని, ప్రతీ మాటను క్షుణ్ణంగా అవగతం చేసుకొని, అందులో అభ్యంతరకరమైన అంశాలు కానీ, ఎవరి మనోభావాలు దెబ్బతినే అంశాలు కానీ లేవని ఒకటికి వందసార్లు గమనించుకొని, భావవ్యక్తీకరణ శైలిని కుడా గమనించి ఒక నిర్ణయానికి వచ్చారు, శ్రోతల ఉత్సాహం ద్విగుణీకృతం చేసే గొప్ప సంగీతం అందించిన కీరవాణి గారి బాణీ కుడా, నూటైదుగురు జ్యూరీ సభ్యులకు వంక పెట్టడానికి లేనివిధంగా నచ్చి ఈ గోల్డెన్ గ్లోబ్ 2023 అవార్డుని సగర్వంగా ప్రకటించారు.

ఈ పోటీలో ప్రపంచ ప్రఖ్యాత గాయనీమణులు, లేడీ గాగా, టేలర్ స్విఫ్ట్, రెహానా వంటి వారిని దాటుకొని ఒక తెలుగువాడి పాట గెలిచింది. ఆసియాఖండం నించి తొలిసారిగా, నిజానికి భారతదేశం నుండి కుడా తొట్టతొలిసారిగా ఒక సంగీత దర్శకుడు, గీత రచయిత ఈ గోల్డెన్ గ్లోబ్ అవార్డు దక్కించుకోవడం, తెలుగుపాట ఘనతను లోకానికి సగర్వంగా చాటిచెప్పడం అనేది చారిత్రకం. ఆ సంగీత దర్శకుడు – గీత రచయిత మన తెలుగువారైన కీరవాణి గారు, చంద్రబోస్ గారు అవడం ప్రతీ తెలుగోడి గుండెకీ ఆనందదాయకం.

*"చరిత్రలో నీకో కొన్ని పేజీలుండాలి" అని తన కలంతో చెప్పి ఆగక, దాన్ని నిజం చేసి చూపించారు చంద్రబోస్ గారు.*

ఈ సందర్భంగా, గోల్డెన్ గ్లోబ్ అవార్డు గ్రహీత శ్రీ కీరవాణి గారికీ, శ్రీ చంద్రబోస్ గారికి ప్రతి తెలుగు ప్రేక్షకుడి తరఫున శతాధిక శుభాకాంక్షలు. త్వరలో మీరు ఆస్కార్ అవార్డు కుడా గెలుచుకొని మరోసారి చరిత్ర సృష్టిస్తారని నమ్ముతున్నాము... అని రచయిత్రి ఆకాంక్షించినట్లుగా 'ఆస్కార్'ను సొంతం చేసుకుంది 'నాటు నాటు'.

**- మాధురి ఇంగువ,** యు.యస్.ఏ

# అమరజీవి త్యాగం అజరామరం

## జిల్లా కలెక్టర్ నివాళి



తెలుగు ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన త్యాగధనుడు శ్రీ పొట్టి శ్రీరాములు అని, వారి త్యాగం అజరామరమని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. ఈనెల 16వ తేది గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం జరిగింది. అమరజీవి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహాత్మాగాంధీజీ మార్గంలో పొట్టి శ్రీరాములు పయనించి స్వాతంత్ర్య సమరంలో ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారన్నారు. ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన ప్రాణత్యాగం చేసి దేశవ్యాప్తంగా కూడా భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు నాంది పలికారన్నారు. పొట్టి శ్రీరాములు లాంటివారు 11 మంది అనుచరులు ఉంటే కేవలం ఒక్క సంవత్సరంలోనే స్వాతంత్ర్యాన్ని సాధించవచ్చునని మహాత్మాగాంధీజీ అన్నారంటే పొట్టి శ్రీరాములు ఎంతటి దేశభక్తి, పోరాటపటిమ, అంకితభావం కలవారో తేటతెల్లమవుతుందన్నారు. మన జిల్లా 'శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా'గా పిలవబడుతుండడం జిల్లాకే గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, జిల్లా పర్యాటక శాఖాధికారి కనకదుర్గాభవాని, ఎపిఎంఐపి పీడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం నగరంలోని ఆత్మకూరు బస్టాండు వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ హరిత, 'నుడా' ఛైర్మెన్ ముక్కాల ద్వారాకానాథ్ తదితరులు పాల్గొన్నారు.

# బ్యాలెట్లలో భవిష్యత్తు

## • చంద్రశేఖరరెడ్డికే 'తొలి' ప్రాధాన్యత

నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం నియోజకవర్గాల పట్టభద్రులు మరియు ఉపాధ్యాయుల శాసనమండలి ఎన్నికలు ఈసారి చాలా ప్రతిష్టాత్మకంగా జరిగాయి. ముఖ్యంగా ఈ మూడుజిల్లాలకు సంబంధించిన నియోజకవర్గ అధికారపార్టీ అభ్యర్థులిద్దరూ ఉమ్మడి నెల్లూరుజిల్లా వాసులు కావడం విశేషం. ఇద్దరిదీ గూడూరు నియోజకవర్గమే. పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయుల నియోజకవర్గ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి ఇద్దరు కూడా ఈ ఎన్నికలను ఛాలెంజ్‌గా తీసుకున్నారు. తాము అధికారపార్టీ అభ్యర్థులమన్న ధీమాతో ఉండకుండా ఇద్దరూ రాత్రీపగలూ అన్న తేడాలేకుండా మూడు జిల్లాలలో పర్యటించారు. సాధారణ ఎన్నికల తరహాలోనే ఈ ఎన్నికలలో కూడా అవసరమైన చోట కావలసిన సరంజామా అంతా వాడారు. టక్కుటమార విద్యలన్నీ ప్రదర్శించారు. కొన్ని చోట్ల చాణక్యతతో వ్యవహరించారు. పాత ఓట్లను పూర్తిగా రద్దుచేసి మళ్ళీ కొత్తగా నమోదు చేసుకోవాలన్న నిబంధన వీరిద్దరికీ బాగా కలిసొచ్చిందనే చర్చ సర్వత్రా వినపడుతోంది. ముఖ్యంగా తొలిసారిగా ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు కూడా ఓటింగ్ అవకాశం రావడం ఎన్నికలను తమకు అనుకూలంగా మలచుకోవడానికి ఉపాధ్యాయ అభ్యర్థులకు ఉపయోగపడిందని విశ్లేషకుల అంచనా.

ఇప్పుడు ఇద్దరి భవిష్యత్తు బ్యాలెట్లపైకి చేరింది. 16వతేది ఉదయం 8గంటల నుండి చిత్తూరులో ఓట్ల లెక్కింపు మొదలయ్యింది. గురువారం సాయంత్రం 7 గంటలా 30 నిముషాల వరకు అందిన సమాచారాన్నిబట్టి పట్టభద్రుల ఓట్లు కట్టలు కట్టే ప్రక్రియ కొనసాగుతోంది. ఉపాధ్యాయుల తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు నాలుగు రౌండ్లలో పూర్తయ్యింది. తొలి మూడు సైకిళ్లలో (ఒక్కొక్క రౌండుని సైకిల్‌గా పిలుస్తారు) 7000 ఓట్ల లెక్కన లెక్కపెట్టి, చివరి సైకిల్‌లో 3,741 ఓట్లను లెక్కించి తొలి ప్రాధాన్యత ఓటింగ్ లెక్క తేల్చారు.

చివరిగా వచ్చిన ఫలితం ప్రకారం తొలి ప్రాధాన్యత ఓటింగ్‌లో వైసీపీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డికి 10,757, పీడీఎఫ్ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబురెడ్డికి 8,858, టీడీపీ బలపరిచిన స్వతంత్ర అభ్యర్థి ఎల్.సి.రమణారెడ్డికి 3,417 ఓట్లు వచ్చాయి. ఇతరులందరికీ కలిపి 1,504 ఓట్లు వచ్చాయి. తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ముగిసిన సమయానికి చంద్రశేఖర్‌రెడ్డి 1,869 ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు కొన్ని స్వతంత్ర అభ్యర్థికి మద్దతు తెలపడంతో చంద్రశేఖరరెడ్డి గెలుపు ఖాయం అని విశ్లేషకులు అంచనా వేసినట్లుగా తొలి ప్రాధాన్యతలో ఫలితం ఆయనకి అనుకూలంగా వచ్చింది.

మొత్తం పోలైన 24,741 ఓట్లలో తొలి ప్రాధాన్యత ఓట్లలో సగానికిపైగా చంద్రశేఖరరెడ్డికి వచ్చి ఉంటే ఆయనని విజేతగా ప్రకటించి ఉండేవారు. కానీ అలా జరగలేదు. ఇప్పుడు మళ్ళీ రెండవ ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. ఈ తతంగం మొత్తం ముగిసి పట్టభద్రుల నియోజకవర్గ ఫలితం వచ్చేసరికి గురువారం అర్ధరాత్రి లేదా శుక్రవారం ఉదయం కావచ్చు. పట్టభద్రుల నియోజకవర్గ ఫలితం మాత్రం శుక్రవారం అర్ధరాత్రి లేదా శనివారం మధ్యాహ్నానికి తెలియొచ్చని అంచనా వేస్తున్నారు. మొత్తానికి శాసనమండలి అభ్యర్థుల భవిష్యత్తు బ్యాలెట్ రూపంలో బాక్సుల నుండి టేబుళ్లపైకి చేరింది. వేచిచూద్దాం... ఏం జరుగుతుందో!..

## 'సరస్వతీ సమాజం'లో..22న ఉగాది వేడుకలు

శ్రీ శోభకృతు నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మార్చి 22న నెల్లూరులోని శ్రీ అన్నదేవుల గోవిందురెడ్డి సరస్వతీ సమాజం ఆధ్వర్యంలో సాయంత్రం 5గంటలకు వేడుకలు నిర్వహించనున్నామని సరస్వతీ సమాజం కార్యదర్శి టి.రమణయ్య తెలిపారు. ఈ వేడుకల్లో విద్వాన్ మాచవోలు పట్టాభిరామారావు పంచాంగశ్రవణం చేస్తారని, సమాజం అధ్యక్షులు మోపూరు పెంచలయ్య అధ్యక్షత వహిస్తారని, డికెడబ్ల్యు కళాశాల తెలుగు విభాగాధిపతి డా.వై.దివ్య పాల్గొంటారని, తొలుత అలగానిపాడు లోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి కోలాట భజనమండలి మహిళా బృందం వారి కోలాట భజన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.




లాయర్
మార్చి 17, 2023

# ప్రపంచమంతటా ప్రతిధ్వనిస్తున్న.. మన పాట

‘గుండెలదిరిపోయేలా డండనకర మోగినట్టు..సెవులు సిల్లులు పడేలాగ కీసుపిట్ట కూసినట్టు’... ‘భూమి దద్దరిల్లేలా.. ఒంటిలోని రగతమంత రంకెలేసి ఎగిరేలా’... దుమ్ము దులిపేసింది తెలుగుపాట. ‘తెలుగెంత గొప్పది అంటే...నాటు పాటంత’ అన్నంతగా నాటు నాటు పాట’ వీరనాట్యం చేసింది. ప్రపంచంలోని ప్రతిష్ఠాత్మకమైన అవార్డు..‘ఆస్కార్’ను దిగ్విజయంగా సాధించి తెలుగువాళ్ల సత్తాను చాటుతూ విజయపతాకను ఎగురవేసింది. ప్రపంచమంతా ఆ రెపరెపలే కనిపిస్తున్నాయిప్పుడు. ఆర్ఆర్ఆర్ చిత్రంలోని ఆ పాట విశ్వయవనికపై మార్మోగింది. ఆ ప్రతిధ్వనులే తెలుగువారి గుండెల్లో ఆనందతాండవం చేస్తున్నాయి. నిజంగా ఇది అపూర్వం..అద్భుతం..అద్వితీయం..చరిత్రాత్మకం కూడా. తెలుగువారి కీర్తిచంద్రికలు వినువీధినంటిన మహోన్నతమైన సందర్భం ఇది. ఇంతకన్నా తెలుగువారి ఆనందానికింకేమి కావాలి!..అయితే, ఇది కేవలం తెలుగువారి విజయమే కాదు.. ఆ కీర్తి తెలుగుసినిమాకే కాదు.. భారతీయ చిత్రరంగానికే అపురూప గౌరవం!..

ఆస్కార్ అవార్డు సాధించడమంటే సాధారణ విషయం కాదు. అసాధ్యాన్ని సుసాధ్యం చేయగల అత్యంత ప్రతిభామూర్తులకే ఇందులో స్థానం లభిస్తుంది. అయితే ఆ అదృష్టం భారత్‌కు దక్కింది. ఎట్టకేలకు, ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. భారతీయ కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం సరిగ్గా అయిదున్నర గంటలకు లాస్ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్లలో ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవంలో ‘నాటు పాట’కు అవార్డు బహుకరిస్తున్న దృశ్యాలను సామాజిక మాధ్యమాల్లో చూస్తున్న భారతీయుల హృదయాలు, ప్రత్యేకించి తెలుగువారి మనసుల్లో ఆనందం పరవళ్లు తొక్కింది. ‘ఎర్రజొన్న రొట్టెలోన మిరపతొక్కు, తొక్కినట్టు’ సగర్వంగా తెలుగుపాట విజయకేతనం ఎగరేసింది. భారతీయుల కల సాకారమైంది. ఆర్ఆర్ఆర్ చిత్రంలో ప్రముఖ సినీకవి చంద్రబోస్ రాసిన ‘నాటు నాటు’ పాట..95వ ఆస్కార్ అవార్డ్స్ ప్రదానోత్సవాల్లో ఒరిజినల్ మ్యూజిక్ స్కోర్ విభాగంలో ఆస్కార్ అవార్డును గెలుచుకోవడం విశ్వవీధిలో తళుకుమనే తారకలా తెలుగుపాట వెలుగులు చిందించడం.. మాటల్లో చెప్పలేనంత ఆనందానుభూతి. విశ్వవేదికపై తెలుగుపాట వీరవిజయం సాధించింది. ఒక్కమాటలో చెప్పాలంటే, తెలుగుపాటకు పట్టాభిషేకం చేసినట్లయింది. దీంతో ప్రపంచం నోట ఇప్పుడు తెలుగుపాట ప్రతిధ్వనిస్తోంది. దేశానికి తొలి ఆస్కార్ అవార్డును సాధించి పెట్టి ఆర్ఆర్ఆర్ సినిమా చరిత్ర సృష్టించింది. గతంలో ‘గాంధీ’, ‘స్లమ్ డాగ్ మిలియనీర్’ వంటి చిత్రాలకు భారతీయులకు ఆస్కార్ అవార్డులు వచ్చినా, అవి భారతీయ చిత్రాలు కావు. అందుకే ఆస్కార్ సాధించిన తొలి భారతీయ చిత్రం ‘ఆర్ఆర్ఆర్’ రికార్డు బద్దలు కొట్టింది. రాజమౌళి దర్శకత్వంలో, డివివి దానయ్య నిర్మించిన ఆర్ఆర్ఆర్ చిత్రంలో.. ఆ పాటకు అద్వితీయమైన రీతిలో సంగీతం సమకూర్చిన ప్రసిద్ధ సంగీతదర్శకుడు కీరవాణి, పాటకు తగ్గట్టుగా ప్రముఖ హీరోలు ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లు వేసిన స్టెప్పులు, చేసిన నృత్యం పరమాద్భుతం. దాదాపు వారిద్దరూ ప్రదర్శించిన ఆ నృత్యంలో ఎటుచూసినా ఇద్దరి నృత్యభంగిమలు ఒకటేగా ఉండడం ఇంకా అపురూపం. నృత్యదర్శకుడు ప్రేమ్‌రక్షిత్ తన అసాధారణమైన ప్రతిభను ఈ పాటలో నిరూపించుకున్నారు. రాహుల్ సిప్లిగంజ్, కాలభైరవలు ఆ పాటకు తమ గళంతో ఉరకలేయించారు. ప్రపంచవ్యాప్తంగా 81 పాటలు పోటీకి వస్తే, అందులో 15 పాటలు నిగ్గుతేలితే, వాటినుంచి 5 పాటలు ఆస్కార్ అవార్డులకు నామినేట్ అయ్యాయి. ప్రపంచ ప్రఖ్యాతి చెందిన లేడిగాగా, రిహాన్నా, టేలర్ స్విఫ్ట్ తదితర ఉద్దండులైన గాయకుల పాటలను కూడా వెనక్కునెట్టి, తెలుగుపాట ఆస్కార్ వేదికమీద అజేయంగా నిలిచింది. పూర్తిగా స్వదేశీ చిత్రమైన ఆర్ఆర్ఆర్‌లో తెలుగుపాట చేవ ఏమిటో చూపిస్తూ చంద్రబోస్ రాసిన నాటుపాట అదరగొట్టేసింది. ఇదే సందర్భంలో మన దేశానికి చెందిన ‘ఎలిఫెంట్ విస్పరర్స్’కు బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్‌ఫిల్మ్ విభాగంలో ఆస్కార్అవార్డు లభించడంతో ఈసారి భారత్ రెండు ఆస్కార్ అవార్డులను సాధించడం అందరి అభినందనలు అందుకుంటోంది. పర్యావరణ పరిరక్షణను చాటే ఆ చిత్రం భారతీయుల ప్రతిభా పాటవాలకు ప్రతీక. ఏదేమైనా, తెలుగుపాటకు ఇంత ఖ్యాతి.. విశ్వవిఖ్యాతి రావడం ఇదే తొలిసారి. ఈ విజయం.. ఆర్ఆర్ఆర్ చిత్రబృందానికే కాదు..తెలుగువారికి, భారతీయ సినిమాకు, దేశానికే కాదు..మొత్తంగా ప్రపంచానికే గర్వకారణం.

# ఇల్లు గుల్లచేసే.. పేకాట



‘అయ్యయ్యో! చేతిలో డబ్బులు పోయెనే..అయ్యయ్యో! జేబులు ఖాళీ ఆయెనే’ అంటూ.. ఎప్పుడో ‘కులగోత్రాలు’ పాత సినిమాలో పాట నేటికీ రుజువవుతూనే ఉంది. అందులో మన నెల్లూరు సినీ హాస్యనటబ్రహ్మ రమణారెడ్డి పాత్ర అద్భుతం. ఆ పాటొస్తే చాలు, పేకాట ఎంతగా మనుషుల్ని దివాలా తీయిస్తుందో చెప్పకనే చెప్తుంది. ‘తెలివి తక్కువగ చీట్లపేకలో దెబ్బతింటివోయ్’ అని నెత్తిన గుద్దేసుకుని, ‘చివరికి జోలె తప్పదని’ పేకాటరాయుళ్లకు బుద్ధి చెప్పే ఆ పాట, నేటికీ పాతతరం వారి చెవుల్లో గింగురుమంటూనే ఉంది. అయినా, నేటికీ మన సమాజంలో ‘చీట్లాట’ అనే పేకాట మాత్రం సమసిపోవడం లేదు. అదొక మాయాజూదమని, అదొక నేరమని, దానిలోకి దిగొద్దని ప్రభుత్వాలు చెప్తున్నా, కొందరు పేకాట మత్తులో పడిపోతున్నారు. చీట్లాట లేకుండా నిదరే రాని పేకాటరాయుళ్లు కూడా ఎందరో ఉన్నారు. నిద్రమంచం లేచిందగ్గర నుంచి వారికదే కలవరింత. పేకాటాడుతున్నట్లు, అందులో తాము గెలిచిపోయి లక్షలు సంపాదిస్తున్నట్లు భ్రమపడుతుంటారు. అవన్నీ కలలే!..కలదెలుసుకునేసరికి అంతా అయిపోతుంది. వంటింట్లో పోపులడబ్బాలో భార్య భద్రంగా కూరాకుల ఖర్చులకని, దాచుకున్న చిల్లర కూడా మాయమైపోతుంటుంది. అవసరమైతే మనోళ్ళు ఎంతకైనా తెగించి, పెళ్ళాం పుస్తెల్ని కూడా తెంపుకుపోయి పేకాటలో పెట్టి, ఉత్తచేతుల్తో ఇళ్ళకొచ్చే మహానుభావులెందరో ఉన్నారు. ఇప్పుడు పల్లెల్లోనే కాదు, పట్టణాలు మహానగరాల్లో కూడా పేకాట ఆడడం మరీ ఎక్కువైపోయింది. ఏదైనా తెలియక చేస్తే పొరపాటు అంటాం. ఆ పొరపాట్లే పదేపదే చేస్తే అది అలవాటవుతుంది. ఆ అలవాటే చివరికి వ్యసనంగా మారిపోతుంది. చీట్లపేక విషయం కూడా అంతే. సరదాగా పేకాటలో కూర్చున్నవారు చిన్నగా దాని మాయలోకి జారిపోతారు. గంటల తరబడి కాలం తెలియకుండా, ఇంకా ఇంకా ఆడుతూనే ఉంటారు. డబ్బులు పెట్టి మరీ ఆడడంతో అదో పెద్ద జూదంగా మారిపోయింది.

## సమస్యల తో ‘రణం’

ఈ జూదం వేలాదిమంది పేకాటరాయుళ్లకు నిత్యం కుచ్చుటోపీ పెడుతూనే ఉంది. పేకాట స్థావరాల్లో పేకాట ఆడుతూ పట్టుబడుతున్న వారెందరో మన నెల్లూరు జిల్లాలో పేపర్లలో నిత్యం చూస్తూనే ఉన్నాం. నెల్లూరొక్కటే కాదు, రాష్ట్రమంతా ఇదే తంతు. జూదస్థావరాలు కూడా పెరిగిపోతున్నాయి. పాడుబడిన స్థలాలు, స్మశాన ప్రాంతాలు, జనసంచారం లేని చోట్లలో ఈ స్థావరాలు జోరుగా వెలుస్తున్నాయి. ఆడేవాడు ఎక్కడున్నా ఇక్కడికి రావాల్సిందేగా అన్న ధీమా నిర్వాహకులది. ఒకరికొకరుగా జట్టు కట్టి ఈ పేకాట బృందాలు మోటారు బండ్లేసుకుని సర్రుమని అక్కడకి వెళ్తుంటారు. ఇంట్లో వాళ్లకి మాత్రం తామేదో కష్టపడి కుటుంబం కోసం కష్టపడుతున్నట్లు ఫోజులు కొడుతూ, పేకాట స్థావరాలకి వెళ్తుంటారు. ఇక అన్నం నీళ్ళు అక్కర్లేదు. చేతిలో డబ్బులు అయిపోయిందాకా అదే ఆట. అంతా అయ్యాక ఇల్లు గుర్తొస్తుంది. ఇంట్లో కుదవ పెట్టడానికి ఇంక ఏమేం వస్తువులున్నాయో జ్ఞాపకం వస్తుంది. అవన్నీ తీసుకొచ్చి పేకాటలో తగలేసిందాకా నిద్రపట్టదు పేకాటరాయుళ్ళకి. ఈ మధ్యలో కుటుంబం ఏమైపోయినా, భార్యాబిడ్డలు ఎన్నిబాధల్లో ఉన్నా పట్టించుకోరు. యువతరం వారికంటే, ఇళ్లల్లోని పెద్దలే అధికశాతం మంది పేకాటస్థావరాలకు వెళ్తుండడం మరింత విచారకరం. కొంతమంది మంచి ఉద్యోగం చేస్తున్నవాళ్లు, సమాజంలో మర్యాదస్తులనబడేవాళ్లు కూడా అనేకమంది పేకాటకు బానిసలైపోతుండడం బాధాకరం. ఎంతగా పేకాట ఆడినా ఏదో ఒకరోజు లక్షల్లో గెలుచుకుంటామన్నది కేవలం భ్రమే. ఈలోగా ఇంట్లో ఉన్న డబ్బు, జేబులో ఉన్న చిల్లరతో సహా.. ఒంట్లో ఉన్న ఓపికా అంతా అయిపోతాయి.

పేకాటలో డబ్బు వచ్చినట్లే వచ్చి.. పోతూనే ఉంటుంది. అందుకే దీన్ని మాయాజూదం అంటారు. ఒకవేళ మీరు ఏ జూదస్థావరంలో పేకాటాడుతున్నారో పోలీసులకు తెలిస్తే..మీపని గోవిందా!..పేకాటరాయుళ్ళు ఎంతోమంది ఇటీవల నెల్లూరుజిల్లాలో తరచూ పోలీసులకు దొరికిపోతూనే ఉన్నారు. పోలీసులు వారిని పట్టుకున్నప్పుడు, ఫోటోలు తీస్తున్నప్పుడు ముఖాలు కనబడకుండా తలలు వంచుకుంటుంటారు. ఎంత ఖర్మో చూడండి! ఎంత పరువుమాలిన, ఎంత పనికిమాలిన విషయమో పేకాట అంటే. పోలీసులు పట్టుకుపోతుంటే, తమ ఇంటిపెద్దలు వారి ముందు తలదించుకుని నడుస్తుంటే, వారి కుటుంబసభ్యులు ఎంతగా వేదనపడతారో.. ఒక్కసారి ఆలోచించండి. అందులో పిల్లల ముందు ఎంత చిన్నతనంగా ఉంటుందో ఊహించుకోండి. పిల్లలకు బుద్ధులు చెప్పాల్సిన పెద్దలే పేకాటకు బానిసలు కావడం ఘోరం!.సంసారాలను గుల్ల చేసే ఈ ఆట నేరమని తెలిసీ, ‘మనం దొరకం కదా’.. అని అనుకుంటూనే ఏదోఒకరోజు దొరికిపోవడం ఖాయం. అంతటితో మన ఆట కట్టు!..ఎందుకు నాయనా..ఈ ఖర్మంతా!..ఇకనైనా పేకాట మానుకోండి. ఇల్లు గుల్ల చేసి, మెడకి జోలెకట్టే పేకాట జోలికి పోకండి. జైలులో పడి పరువు పోగొట్టుకోకండి. మీరు బాగుంటేనే కుటుంబ సంక్షేమం..కుటుంబ సంతోషం అని మరువకండి. డబ్బు సంపాదనకు మంచిమార్గాలు బోలెడన్ని ఉన్నాయి. సమాజంలో ఎందరో కష్టించి బతుకుతున్నారు..వారినిచూసైనా తెలివి తెచ్చుకోండి. నేరపూరితమైన పేకాట వంటి ఆటలను ఇకనైనా విడిచిపెట్టండి. అందులోనూ కుటుంబపెద్దలుగా ఉన్నవారు, మర్యాదస్తులుగా ఉన్నవారు.. పేకాటరాయుళ్లుగా.. జూదగాళ్ళుగా.. నేరగాళ్ళుగా బతకకండి. ఇకనైనా మర్యాదగా..మంచి మనుషులుగా బతకడం నేర్చుకోండి. కాస్త కఠినంగా చెప్పున్నందుకు క్షమించండి!...

- సంచారి

# వర్ధిల్లుతున్న ధనస్వామ్యం..?

మారుతున్న సమాజంలో ప్రజాస్వామ్యం కొత్త పుంతలు తొక్కుతోంది. ధనం, దౌర్జన్యం రాజ్యమేలుతున్నాయి. తాజాగా జరిగిన ఉపాధ్యాయులు, పట్టభద్రులు, స్థానిక సంస్థల ఎన్నికలను ఒకసారి గమనిస్తే పరిస్థితులు ఎంత ఘోరంగా, నీచంగా తయారయ్యాయో అర్థమైపోతుంది. అధికార పార్టీ బలంగా ఉంది కాబట్టి స్థానిక సంస్థల విషయం పెద్దగా పట్టించుకోవలసిన అవసరం లేదు. ఎందుకంటే అవి ఎలాగూ వారి ఖాతాలోనే పడతాయి. ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎన్నికల విషయం చూస్తేనే ఎన్నికల వ్యవస్థపై జుగుప్స కలుగుతోంది. చదువు చెప్పేవారిని, చదువుకున్నవారినీ ఇద్దరినీ లొంగితే డబ్బులతో.. లేకుంటే దెబ్బలతో వశపర్చుకునే ప్రయత్నం అధికారపార్టీ అభ్యర్థులు చేయడం అత్యంత శోచనీయం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి చర్యలు అత్యంత నీచమైనవి, హేయమైనవి, క్షమించరానివి. గెలుపోటముల విషయం ఇక్కడ అప్రస్తుతం. నా ఆందోళనల్లా ఒక్కటే. అక్షర జ్ఞానం కలిగిన మేధావులకు సంబంధించిన ఎన్నికలలోనే ఇంత డబ్బు, దౌర్జన్యం విచ్చలవిడిగా రాజ్యమేలితే, ఇక రాబోయే రోజుల్లో సామాన్య ప్రజలు పాల్గొనే సాధారణ ఎన్నికల ముఖచిత్రం ఏ విధంగా ఉండబోతోందో ఊహించుకోవడానికే భయమేస్తోంది..!


కే. లక్ష్మీనారాయణరెడ్డి,
రిటైర్డ్ హెడ్మాస్టర్ - వేదాయపాలెం.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741


# అగ్నిప్రమాదాలతో జాగ్రత్త!

అసలే ఎండాకాలం మండిపోతోంది. ఈ వారంలో జిల్లాకు వర్షసూచన ఉన్నా, ఒకవేళ వర్షాలు వచ్చినా, ఆ తర్వాత మళ్ళీ ఎండ భగ్గుమంటుంది. వేసవికాలంలో ముఖ్యంగా అగ్నిప్రమాదాలు జరగకుండా ఎవరికి వారు జాగ్రత్తలు తీసుకోవాలి. ఆ మేరకు అధికారులు కూడా ప్రజలను చైతన్యవంతం చేయాలి. ఇప్పటికే జిల్లాలో పలుచోట్ల అగ్నిప్రమాదాలు జరిగినట్లు వార్తలొచ్చాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకునేదానికంటే ముందుజాగ్రత్తతో ఉండడం మేలు కదా!..అగ్నిమాపకదళ అధికారులు అప్రమత్తంగా ఉండి, ప్రజలను కూడా అప్రమత్తం చేయాలి. అదే సందర్భంలో అడవుల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చిన్న అగ్గిరవ్వ పడితే అడవంతా కాలిపోతుంది. జిల్లా పరిధిలోని అడవుల్లో అపరిచిత వ్యక్తులు, ఆకతాయిలు వెళ్ళకుండా అటవీప్రాంతాల్లో భద్రతా చర్యలు తీసుకోవాలి. ఎప్పుడు వేసవి వచ్చినా ముఖ్యంగా అల్లాడిపోయేది పశుపక్ష్యాదులు, జంతువులు, వన్యప్రాణులు వంటి మూగజీవాలే. అడవుల్లో నీళ్లు దొరక్క జనావాసాలకు వచ్చి కుక్కల బారిన పడుతుంటాయి జింకలు, దుప్పుల వంటి వన్యప్రాణులు. అడవుల్లో నీళ్ల తొట్టెలను అక్కడక్కడా ఏర్పాటుచేసి, వాటికి నీరందించేందుకు అటవీ అధికారులు కృషిచేయాలి. ఎండాకాలం వస్తుంది-పోతుంది..అంతా మామూలే కదా అని ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా వేసవిలో ఇబ్బందులు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమం.

- ఆర్.పి.రామయ్య, కొండాయపాలెం.







## ఆడంబర సంబరాలుగా...

# నరసారెడ్డి కుమార్తె వివాహ వేడుకలు

నిర్మాణ రంగంతో పాటు ఆతిథ్య రంగంలో తన ప్రతిభను చూపిస్తూ తమ కెన్సెస్ సంస్థలకి విశేష గుర్తింపు తెస్తున్న కొండ్లపూడి నరసారెడ్డి - లక్ష్మీరెడ్డిల ముద్దుల కుమార్తె సంయుక్ష - సిద్ధార్థ్ (సిద్ధారెడ్డి వెంకట సుదర్శన్‌రెడ్డి - అశ్వినిరెడ్డిల కుమారుడు)ల పెళ్ళి వేడుకలు మార్చి 11వతేది చెన్నైలో ఆడంబర సంబరాలుగా జరిగాయి. మహాబలిపురంలో నరసారెడ్డి కుటుంబానికి చెందిన "వెల్కమ్ హోటల్ కెన్సెస్ పామ్ బీచ్"లో ఉదయం జరిగిన పెళ్ళిలోను, సాయంత్రం జరిగిన రిసెప్షన్‌లోనూ వివిధ ప్రాంతాలకు చెందిన రాజకీయ, వ్యాపార, సినీ ప్రముఖులతో పాటు నరసారెడ్డి ఆప్తులు, ఆత్మీయులు, హితులు, సన్నిహితులు, స్నేహితులు అధిక సంఖ్యలో పాల్గొని నవ జంటకు తమ ఆశీస్సులు అందించారు. సంయుక్ష - సిద్ధార్థ్‌లకి 'లాయర్' శుభాకాంక్షలు.

# మే1 నుంచి.. పెంచలకోన బ్రహ్మోత్సవాలు

జిల్లాలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రాపూరు మండలం పెంచలకోనలో వెలసివున్న శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి దేవాలయంలో మే నెల 1 నుంచి 7వతేది వరకు అత్యంత వైభవంగా స్వామివారి ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా ఇటీవల పెంచలకోనలోని బలిజ, కాపు, ఒంటరి, తెలగ అన్నదానసత్రం కమిటీ ఛైర్మెన్ కోనేటి మురళి ఆధ్వర్యంలో ప్రతినిధులు సమావేశమయ్యారు. బ్రహ్మోత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు ఆలయానికి వస్తారు కనుక, వారికి అన్నప్రసాద వితరణ చేసేందుకు అవసరమైన ఏర్పాట్ల విషయమై చర్చించారు.






# 'తంగిరాల మహాభారతం' 46వ భాగం




పాండవులు కుంతీతో పాటు పాంచాల నగరానికి ప్రయాణమవుతారు. దారిలో వారికి వేదవ్యాసుడు ప్రత్యక్షమయ్యి, ద్రౌపది యొక్క పూర్వ చరిత్రను చెపుతాడు. పూర్వ కాలంలో ఒక మునీశ్వరుడి కుమార్తెకు ఎప్పటికీ పెళ్లి కాకపోతే, శివుణ్ణి గురించి తపస్సు చేసి అయిదుసార్లు పతి కావలెనని కోరినప్పుడు శివుడు, అయిదుగురు భర్తలనిస్తాడు. ఆమె అభ్యంతరం చెపుతున్నా, దానికి తిరుగులేదని శివుడు వరమిచ్చి వెళ్ళిపోతాడు. ఆ తర్వాత ఆమె ద్రౌపదిగా జన్మించింది. అది చెప్పి వేదవ్యాసుడు, పాండవులను త్వరగా పాంచాలరాజ్యానికి వెళ్ళమంటాడు.

పాండవులకు దారిలో భగీరథీ తీరంలో అంగారపర్ణుడు అనే గంధర్వరాజు కనపడి మీరు ఇక్కడికి రాకూడదని వారి మీద బాణాలు వేస్తాడు. అర్జునుడు అతని మీద ఆగ్నేయాస్త్రం సంధించి అతని రథాన్ని భస్మంచేసి, అతన్ని ఓడించి, బంధించి ధర్మరాజు దగ్గరకి తీసుకువస్తాడు. అతని భార్య వచ్చి పతిభిక్ష పెట్టమని కోరినప్పుడు ధర్మజుడు వదిలేస్తాడు. అప్పుడు అంగారపర్ణుడు తన పేరుని చిత్రరథుడు అని మార్చుకుంటాడు.

అతను పాండవులతో చెలిమి కావాలని వారికి ఒక్కొక్కరికి నూరేసి ఉత్తమ గుర్రాలని ఇస్తాడు. అర్జునుడు కూడా అతనికి ఆగ్నేయాస్త్రం బహూకరిస్తాడు. అంగారపర్ణుడు పాండవులకు పురోహితుడి ఆవశ్యకత చెప్పి, దగ్గరలో ఉన్న వుత్కోచ ఆశ్రమంలో ధౌమ్యుడనే మునీశ్వరుణ్ణి ప్రార్థించి ఆయన్ను పురోహితుడిగా పెట్టుకోమంటాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
**పూర్తి నిడివి కోసం**
**Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.**




# నెల్లూరు కబుర్లు

## యాదవ భవన్‌కు..బీఎంఆర్ భూమిపూజ

నెల్లూరులోని కొండాయపాళెం–గొలగమూడిరోడ్డులో ఈనెల 12న రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బిఎంఆర్) యాదవ భవన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. యాదవ యువతకు అన్నివేళలా అండదండలందిస్తామని, యాదవ యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. 10 కోట్ల వ్యయంతో ఈ భవనం నిర్మాణం కానుండడం సంతోషకరమన్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

## సాయిదర్బార్‌లో అగ్నిగుండ మహోత్సవం



నెల్లూరు బాలాజీనగర్ శివారుల్లోని పద్మావతినగర్‌లో వెలసివున్న సాయిదర్బార్ అద్దాల మందిరంలో కొలువై ఉన్న శ్రీ పాండురంగస్వామికి ఇటీవల ఆలయ నిర్వాహకులు పెద్దఎత్తున ప్రత్యేకపూజలు నిర్వహించారు. మండలపూజ, పూర్ణాహుతి సందర్భంగా ఎంతో భక్తిశ్రద్దలతో జరిగిన అగ్నిగుండ మహోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పండరి భజన, కోలాటాలతో, భజనలతో పాండురంగ స్వామిని స్మరించుకుంటూ నిర్వహించిన కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. జిల్లాలోని తొలి మహిళా పండరిభజన గురువు లక్ష్మీసాయి, ఆదూరుపల్లి శీనయ్య, వారి శిష్యబృందం సహకారంతో అగ్నిగుండ మహోత్సవం వేడుకగా జరిగింది. అనంతరం ఆ గురువులను సాయిదర్బార్ నిర్వాహకులు మధుసాయి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

## డా. గంగిశెట్టికి..'బాలసాహితీ రత్న' బిరుదు



నెల్లూరీయుడు, ప్రముఖ బాలసాహితీవేత్త డా.గంగిశెట్టి శివకుమార్‌కు ఈనెల 12న తమిళనాడులో 'బాలసాహితీ రత్న' బిరుదుతో ఘనసన్మానం జరిగింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని చెన్నైలోని పెరంబూరు తెలుగు వెలుగు సంక్షేమ సంఘం వారు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఉన్న బాలసాహితీవేత్తలను ఘనంగా సన్మానించారు. ముక్కాల నమ్మాళ్వార్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో డా. గంగిశెట్టి శివకుమార్‌కు బాలసాహితీరత్న బిరుదును ప్రదానం చేశారు. బాలసాహితీవేత్తలు దార్ల బుచ్చిబాబు (గుంటూరు), ఆర్.కృష్ణస్వామిరాజు (తిరుపతి), బెహరా ఉమామహేశ్వరరావు (పార్వతీపురం), సంగనభట్ల చినరామకృష్ణయ్య(ధర్మపురి), యు.విజయశేఖరరెడ్డి (హైదరాబాద్), చెన్నూరి సుదర్శన్ (ఖమ్మం)లను నిర్వాహకులు సత్కరించారు. ఆ సంఘం అధ్యక్షులు అల్లింగం రాజశేఖర్, కార్యదర్శి డా. బెల్లంకొండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## అమరజీవికి..ఘన నివాళి

ఆంధ్రరాష్ట్ర సాధనకు అసువులర్పించిన త్యాగమయుడు శ్రీ పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా మార్చి16న నెల్లూరులోని అంతర్జాతీయ వైశ్యసమాఖ్య ఉపాధ్యక్షులు కెవి చలమయ్య ఆధ్వర్యంలో అమరజీవికి ఘన నివాళులర్పించారు. శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలదండలు వేసి అంజలి ఘటించారు. వైశ్యసమాఖ్య సభ్యులు నగరకంటి రవీంద్ర, ఎస్ నాగేశ్వరరావు, ఆర్‌వి శరత్, సోమిశెట్టి వెంకటరత్నం, రాయవరపు రామకృష్ణ, ఆర్.శేషగిరి, అవోపా సభ్యులు మురళీకృష్ణ, సీనియర్ సిటిజన్ అనుమాలశెట్టి నరసింహం, జగన్‌మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## హక్కుల పట్ల అవగాహన ఉండాలి

వినియోగదారులు మోసాలకు గురికాకుండా తమకున్న హక్కుల పట్ల అవగాహన కలిగివుండాలని, చైతన్యవంతులుగా ఉంటూ మోసాలకు అడ్డుకట్ట వేయాలని జిల్లా తూనికలు కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్ టి.రవికుమార్ చెప్పారు. ఈనెల 15న నెల్లూరులోని డికెడబ్ల్యు కాలేజీలో వినియోగదారుల హక్కులపై యువతకు జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని, వినియోగదారుల హక్కులను వివరించారు. సెక్టెల్ సిఇఓ పుల్లయ్య, జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు 'సూర్యనమస్కార' పోటీలు

జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 15న నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో సూర్యనమస్కారాల పోటీ నిర్వహించారు. చీఫ్‌కోచ్ యతిరాజ్ ఈ పోటీలను ప్రారంభించి, యోగా ప్రాధాన్యతను తెలియజెప్పారు. అనేకమంది మహిళలు పాల్గొని సూర్యనమస్కారాలను ప్రదర్శించారు. యోగా శిక్షకులు పర్యవేక్షించారు.

## రోటరీ 'ఉగాది పురస్కారాలకు'..దరఖాస్తులు

నెల్లూరు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో వివిధ రంగాలకు చెందిన ప్రతిభావంతులకు ఈనెల 21న ఉగాది పురస్కారాలను అందజేస్తున్నామని రోటరీక్లబ్ అధ్యక్ష కార్యదర్శులు కొండా శేఖర్‌రెడ్డి, సమీవుల్లా తెలిపారు. ఈనెల 18లోగా దరఖాస్తులు పంపాలని, వివరాలకు రోటరీ మేనేజర్ 95428 30347 ఫోన్ నెంబరుకు సంప్రదించాలని పేర్కొన్నారు.

## ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది క్యాలెండర్‌ను ఈనెల 15న నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత చేతులమీదుగా ఆవిష్కరించారు. త్రైతసిద్ధాంత ప్రబోధసేవాసమితి ప్రతినిధులు సురమౌళి, సభ్యులు కెవి రత్నం, ప్రదీప్, విజయలక్ష్మి, రఘురామయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు ఈనెల 15న ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 95 కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతున్నాయి. తొలిరోజు బుధవారం జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎస్పీ విజయారావు, ఆర్ఐఓ వరప్రసాద్‌రావు, పరిశీలకులు మధుబాబు తదితరులు పరీక్షల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్ కొడవలూరు మండలంలోని చంద్ర శేఖరపురం గురుకుల కళాశాలలో ఉన్న పరీక్షల కేంద్రాన్ని సందర్శించారు.

## రంగనాథునికి 20.78 లక్షల ఆదాయం

నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవాలయానికి ఇటీవల జరిగిన బ్రహ్మోత్సవాలతో పాటు 90 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకలను ఈనెల 15న లెక్కించారు. హుండీ ఆదాయం, బ్రహ్మోత్సవ టిక్కెట్ల విక్రయం అన్నీ కలిపి, గత ఏడాదికంటే ఈసారి 7 లక్షల ఆదాయం పెరిగిందని ఆలయవర్గాలు తెలిపాయి. ఆలయ ఛైర్మెన్ శివకుమార్‌ఆచారి, ఇఓ వెంకటేశ్వర్లు, దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ ఆర్‌కె చైతన్య ఈ లెక్కింపును పర్యవేక్షించారు.

## మృతిచెందిన న్యాయవాదులకు సంతాపం

ఇటీవల మృతిచెందిన పలువురు న్యాయవాదులకు ఈనెల 15న నెల్లూరులోని జిల్లా ప్రధానకోర్టు హాల్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని అధ్యక్షతన జరిగిన సంతాప సమావేశంలో ఘనంగా నివాళులర్పించారు. దివంగత న్యాయవాదులు సుబ్బుశర్మ, ఎంసి సుబ్రహ్మణ్యం, కోట చంద్రశేఖరశాస్త్రి, సత్య జగదీశ్వర్‌ల సేవలు మరువలేనివని కొనియాడారు.నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రెసిడెంట్ పి.ఉమామహేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.శ్రీధర్‌లతో పాటు, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## సైలెన్సర్ల మోతకు అడ్డుకట్ట

నెల్లూరులో కొందరు వాహనదారులు పెద్దశబ్దాల సైలెన్సర్లతో పాదచారులను హడలగొడుతున్న నేపథ్యంలో నెల్లూరు ట్రాఫిక్ పోలీసులు వాటిపై గట్టి చర్యలు తీసుకుంటున్నారు. చెవులు చిల్లులుపడేలా శబ్దాలు చేసే సైలెన్సర్లున్న వాహనాలను గుర్తించి, ఆ సైలెన్సర్లను తొలగిస్తున్నారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు వాహనదారుల్లో అవగాహన కలిగిస్తున్నారు. ట్రాఫిక్ డిఎస్పీ ఎండి అబ్దుల్‌సుబాన్ సారధ్యంలో పోలీసు సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ సిఐ ఎం.నాగేశ్వరమ్మ, ఆర్ఎస్ఐలు తిరుమలరెడ్డి, చంద్రమౌళి పాల్గొంటున్నారు.

## ఎన్నికల విధుల్లో.. అనారోగ్యంతో ఉద్యోగి మృతి

ఎన్నికల విధులకు వచ్చిన ఓ ఉద్యోగి హఠాత్తుగా అస్వస్థతకు గురై మరణించిన ఘటన నెల్లూరులో ఈనెల 12న జరిగింది. కావలి విద్యుత్ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సయ్యద్ ఖాదర్‌మొహిద్దీన్ ఎన్నికల విధుల్లో పాల్గొనేదుకు ఆదివారం డికెడబ్ల్యు కళాశాలలోని డిస్ట్రిబ్యూట్ సెంటర్‌కు వచ్చి, ఉన్నట్లుండి చాతీనొప్పితో అస్వస్థత పాలయ్యారు. వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆర్డీఓ మలోల ఆయన భౌతికకాయాన్ని సందర్శించారు.

## ప్రారంభమైన త్యాగరాజ ఉత్సవాలు

### టౌన్‌హాల్‌లో సంగీత సందడి





నెల్లూరు టౌన్‌హాలులో ఈనెల 12న 58వ త్యాగరాజ స్మరణోత్సవాలు ప్రారంభమయ్యాయి. భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ వేడుకలలో భాగంగా, వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి ఆలయం నుంచి సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి, త్యాగరాజస్వామి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా టౌన్‌హాలుకు తీసుకు వచ్చి, టౌన్‌హాలు ప్రాంగణంలోని వేదికపై ప్రతిష్ఠించి పూజలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన అనేక మంది ఔత్సాహిక సంగీత విద్యార్థుల సంకీర్తనల గానంతో టౌన్‌హాలు పులకించిపోయింది. నెల్లూరును మరో తిరువయ్యార్ అనిపించేలా ఈ ఉత్సవాలను తొలుత ప్రారంభించిన మహనీయులు, ప్రముఖ హరికథా కళాకారులు కీ.శే శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి (గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తండ్రి), ఆయన స్నేహితులు దివంగత యనమండ్ర వెంకటేశ్వరశాస్త్రిల చిత్రపటాలను వేదికపై ఉంచి వారిని స్మరించు కున్నారు. తిరుపతికి చెందిన సంగీత విద్వాంసురాలు కె.వందన త్యాగరాజ స్వామి కీర్తనలను వీనులవిందుగా ఆలపించారు. ప్రముఖ సినీగాయనీ మణులు ఎస్పీ శైలజ, ఎస్పీ వసంత పాల్గొని సంగీత, వాద్య కళాకారులను అభినందించి సన్మానించారు.

భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభ కార్యదర్శి డాక్టర్ యనమండ్ర నాగదేవిప్రసాద్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు భక్తిరస స్ఫోరకంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం దాకా స్థానికంగా ఉండే సంగీతకళాకారులు ఆలపిస్తున్న త్యాగరాజస్వామి కృతులు, నాద–వాద్య కచ్చేరీలు, భక్తి గానాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఈ సంగీత పండుగలు ఈనెల 18వ తేదీ వరకు జరుగనున్నాయి.




# బొగ్గు గనుల సమీపంలో పూర్తయిన రైల్వే ప్రాజెక్టులెన్ని?

## పార్లమెంట్‌లో ప్రశ్నించిన ఆదాల



బొగ్గు గనుల సమీపంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న రైల్వే ప్రాజెక్టులు ఎంతవరకు పూర్తయ్యాయని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈనెల 16న పార్లమెంట్‌లో ప్రశ్నించారు. ఆ ప్రాజెక్టులకు గత మూడేళ్లుగా ఏ మేరకు నిధులు కేటాయించారని కూడా అడిగారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి ప్రహ్లాద జోషి అందుకు రాతపూర్వకంగా సమాధానమిస్తూ, దేశంలో మొత్తం 15 ప్రాజెక్టులను నిర్మించ దలిచామని, అందులో 3 పూర్తయ్యాయని, మిగతా 12 ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ. 90కోట్లు ఈ ప్రాజెక్టుల కోసం కేటాయించగా, 82.72 కోట్లు విడుదల చేశారని, 2020-21లో 50.23 కోట్లు కేటాయించగా 45.21 కోట్లు విడుదల చేశారని పేర్కొన్నారు. 2021-22లో 65.48 కోట్లు కేటాయించగా, 58.63 కోట్లు విడుదల చేశారని, 2022-23లో 50.04కోట్లు కేటాయించగా, 40.74కోట్ల రూపాయలు విడుదల చేశారని తెలిపారు.

## దేశంలో మీడియా స్వేచ్ఛకు ఏం చర్యలు తీసుకున్నారు?

దేశంలో మీడియా స్వేచ్ఛ పరిరక్షణకు ఏం చర్యలు తీసుకున్నారని ఆదాల లోక్‌సభలో ప్రశ్నించారు. ప్రపంచ మీడియా స్వేచ్ఛలో భారతదేశ ర్యాంక్ పడిపోయిందని, దీనికోసం నష్ట నివారణ చర్యలు ఏం చేపట్టారని కూడా ప్రశ్నించారు. కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ ఈనెల 16న అందుకు రాతపూర్వకంగా సమాధానం ఇస్తూ ప్రపంచ మీడియా స్వేచ్ఛ సూచికను విదేశీ ప్రభుత్వేతర సంస్థ 'రిపోర్టర్స్ విథౌట్ బోర్డర్స్' అనే సంస్థ దీనిని ప్రకటించిందని తెలిపారు. పారదర్శకత లేని పద్ధతులను పాటించిన ఆ సంస్థ తీర్మానాలు ప్రభుత్వానికి ఆమోద యోగ్యం కాదన్నారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఒక చట్టబద్ధమైన స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ అని, అందులో ప్రభుత్వ జోక్యం ఉండదని తెలిపారు. మీడియా ప్రమాణాల మెరుగుపరచడానికి ఈ సంస్థ కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఇదే సంస్థ జాతీయ అవార్డులను కూడా ప్రదానం చేస్తుందన్నారు.

# శ్రీసిటీ ఇసుజు పరిశ్రమ వితరణ

## సత్యవేడు పాలిటెక్నిక్‌కు 4 లక్షల విలువైన డీజిల్ ఇంజిన్



శ్రీసిటీలోని ఇసుజు పరిశ్రమ వారు సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మెకానికల్ విభాగానికి 4లక్షల రూపాయలు విలువచేసే అధునాతన 4స్ట్రోక్ బిఎస్6 డీజిల్ ఇంజిన్‌ను వితరణగా అందజేశారు. ఈనెల 14న కళాశాల ఆవరణలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఇసుజు ఇంజనీరింగ్ బిజినెస్ సెంటర్ ఇండియా లిమిటెడ్ ప్రెసిడెంట్ రాజేష్ మిట్టల్ పాల్గొని, ఇసుజు-ఐఎంఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ (హెచ్ ఆర్) కెనెడీ, రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ నిర్మల్ కుమార్, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్ సమక్షంలో కళాశాల ప్రిన్సిపాల్ జి. ఉషాదేవికి ఆ ఇంజిన్‌ను అందచేశారు. ఆర్జేడీ నిర్మల్‌కుమార్, ఇసుజు ఫ్యాక్టరీ మేనేజర్ గోపాల్‌కృష్ణన్ పాల్గొన్నారు.

# మంత్రి అంబటిని కలసిన గొల్లపల్లి



ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ (ఏపిఎల్‌డిఏ) ఛైర్మెన్‌గా ఇటీవల నియమితులైన గొల్లపల్లి విజయకుమార్‌యాదవ్, ఈనెల 15న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలసి, విజయవాడలో రాష్ట్ర జలవనరుల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అంబటి రాంబాబును గౌరవపూర్వకంగా కలుసుకున్నారు. తనకు ఏపిఎల్‌ఎడిఏ ఛైర్మెన్ పదవి వచ్చేందుకు సహకరించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# కనువిందుగా రంగనాధుని బ్రహ్మోత్సవాలు



నెల్లూరు రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 2 నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయం విద్యుద్దీప కాంతులతో మెరిసిపోయింది. వాహనోత్సవాలన్నీ నేత్రపర్వంగా సాగాయి. బంగారు గరుడసేవ, కల్యాణోత్సవం కన్నులపండుగ చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రఖ్యాతిచెందిన రంగనాధుని రథోత్సవానికైతే ఇసుకేస్తే రాలనంత జనం వచ్చారు. రంగనాయకులపేట భక్తజనసంద్రంగా కనిపించింది. పొన్నవాహనోత్సవం, ప్రణయ కలహోత్సవం, పుణ్యకోటి విమానం వంటి విశిష్టసేవలు, పూజలతో పాటు పుష్పయాగం, దవనోత్సవాలతో స్వామివారి ఆలయం వివిధ రకాల పుష్పసౌరభాలతో గుబాళించింది. చివరిరోజు ఈనెల 13వ తేది సోమవారం రాత్రి ఆలయం వెనుకవైపు పెన్నానదిలో స్వామివారి తెప్పోత్సవం దేదీప్యమానంగా జరిగింది. ఉభయ దేవేరులతో స్వామివారు తెప్పపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. 'జై రంగా!..శ్రీరంగా' అంటూ పెద్ద పెట్టున దైవనామస్మరణ చేస్తూ భక్తులు పరవశంతో ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తలమండలి వారు, అర్చకులు, భక్తజన బృందాలు, అధికారులు అందరూ సమన్వయంతో కలసిమెలసి పనిచేసి బ్రహ్మోత్సవాలను బ్రహ్మాండంగా జరిపారు.




సంస్మరణ

అమృతమూర్తి, ఆత్మీయదీప్తి,
మా ఇంటి దైవం, మా అమ్మ

**శ్రీమతి పూండ్ల కామేశ్వరమ్మ గారు**

(W/o లేట్ పూండ్ల చెంచురెడ్డి గారు)

తేది.18.03.2023న ఆమె 3వ వర్ధంతి సందర్భంగా
ఆ ప్రేమమూర్తిని సంస్మరించుకుంటూ...

కుమారులు :
డా॥ పూండ్ల శ్రీనివాసులురెడ్డి
పూండ్ల వెంకురెడ్డి
మరియు
కుటుంబసభ్యులు




















### అంగరంగ వైభవంగా, అత్యంత వైభోగంగా, ఆద్యంతం వైభవోపేతంగా

# రోహిత్ - రోహితల కళ్యాణ వేడుక

రత్నం విద్యాసంస్థల వ్యవస్థాపకులు కే.వీ.రత్నం-పద్మావతిల ముద్దుల మనుమడు, కొర్రపాటి వేణుగోపాల్-రమల తనయుడు **సాయిరోహిత్ - డాక్టర్ లక్ష్మీరోహిత**(రుద్రపాటి వెంకటేశ్వర్లునాయుడు - అనుపమల కుమార్తె)ల కళ్యాణం మార్చి 10వతేదీ సాయంత్రం నెల్లూరులో జరిగింది. కొన్ని వేలమంది డాక్టర్లు, ఇంజనీర్ల భవిష్యత్తుకు బంగారు బాట వేసిన గురువుగా, వందకుపైగా ఆగే చిన్నారుల గుండెలను ఆడించిన కనిపించే దైవంగా, ఆపద సమయాలలో తానున్నానంటూ స్పందించే ఆపద్బంధువుగా, నెల్లూరీయులకే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాల విద్య, సేవ, ఆరోగ్య రంగాలకు సుపరిచితులు రత్నం మాష్టారు. ఆయన మంచితనానికి చిహ్నంగా, ఆయన స్నేహ బంధానికి ప్రతీకగా, ఆయన వ్యక్తిత్వానికి సూచికగా ఆయన మనుమడి కళ్యాణ వేదిక ప్రతిబింబించింది. రెండు తెలుగురాష్ట్రాలలోని ప్రముఖ విద్యాసంస్థల యాజమాన్యాలతో పాటు అన్ని పార్టీల రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, అనేక రంగాల ముఖ్యులు కొర్రపాటి, రుద్రపాటి కుటుంబ ఆప్తులు ఆత్మీయులు వేలసంఖ్యలో తరలివచ్చి రోహిత్ - రోహితలను దీవించారు. 'నభూతో న భవిష్యత్' అన్న రీతిలో అలంకరించబడిన కళ్యాణ వేదిక, ప్రత్యేకంగా రూపొందించిన రథాలలో, సంప్రదాయ నృత్యాలతో వధూవరులను స్వాగతించిన వేడుక ఈ పెళ్ళిలో ప్రత్యేక ఆకర్షణ. వచ్చిన ప్రతి అతిథినీ ఆప్యాయంగా పలకరించి ఆహ్వానించిన రోహిత్ బాబాయ్, పిన్నీ కృష్ణకిషోర్ - వాసంతిల ఆప్యాయత, ఆహూతులను తన్మయత్వంతో తడిపి ముద్దచేసింది. 106 రకాల వంటకాలతో వడ్డించిన విందు నలభీమపాకాన్ని తలపించిందంటే అతిశయోక్తికాదేమో. చూడడానికి రెండుకళ్ళూ సరిపోని ఏర్పాట్లు, చెప్పడానికి మాటలు చాలని ఈ పెళ్లి సంబరం గురించి ఎంత వర్ణించినా తక్కువే. రోహిత్ - రోహితలకి 'లాయర్' శుభదీవెనలు.



















## రిసెప్షన్ వేడుకలో పాల్గొన్న ప్రముఖులు

మార్చి 12వతేదీ ఆదివారం మధ్యాహ్నం విజయవాడలోని వివాంట హోటల్‌లో రోహిత్ - రోహితల రిసెప్షన్ వేడుక జరిగింది. ఈ వేడుకకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, వెంకటగిరి శాసనసభ్యుడు, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డితో పాటు గ్లోబల్ హాస్పిటల్స్ వ్యవస్థాపకులు డాక్టర్ కంచర్ల రవీంద్రనాథ్, వారి సోదరుడు రెయిన్‌బో చిన్నపిల్లల హాస్పిటల్స్ ఛైర్మెన్ కంచర్ల రమేష్, వారి మరో సోదరుడు రమాధర్ విచ్చేసి కొత్త దంపతులను దీవించారు. వీరితో పాటు అనేకమంది రాజకీయ, రాజకీయేతర ప్రముఖులు, వారి కుటుంబసభ్యులు, రామచంద్ర ఇంజనీరింగ్ కాలేజీ సిబ్బంది, కొర్రపాటి-రుద్రపాటి కుటుంబాల ఆప్తులు, ఆత్మీయులు, బంధువులు, ఆత్మబంధువులు ఈ వేడుకకు హాజరై రోహిత్ - రోహిత జంటను ఆశీర్వదించారు.



# వెంకయ్య బిజీ బిజీ!



## నెల్లూరు - చెన్నైలలో 5 రోజుల సుడిగాలి పర్యటన

### ఆత్మీయులు, అభిమానుల కార్యక్రమాల్లో పాల్గొన్న పూర్వ ఉప రాష్ట్రపతి

*భారత పూర్వ ఉపరాష్ట్రపతి, ఉషాపతి, మన నెల్లూరు ముద్దుబిడ్డ ముప్పవరపు వెంకయ్యనాయుడికి తిరగడం అంటే ఇష్టం. మాట్లాడడం అంటే ఇష్టం. తనకు ఇష్టమైన వారిని కలవడం అంటే మరీ ఇష్టం. తాను ఏ పదవిలో ఉన్నా తనకు ఇష్టమైన పై పనులన్నీ ఆయన తూ.చ. తప్పకుండా చేస్తూనే ఉంటారు. భారతదేశ 13వ ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన తరువాత కూడా ఆయన తన నైజం మార్చుకోలేదు. అచ్చమైన పంచెకట్టుతో ఉండే తన ఆహార్యంతో పాటు అలవాట్లను కూడా వదులుకోలేదు. భారతదేశంతో పాటు ప్రపంచమంతా కలియ తిరిగారు. గతంలో ఏ ఉపరాష్ట్రపతి చేయనన్ని పర్యటనలు చేశారు. ఉపరాష్ట్రపతిగా పదవీ విరమణ పొందిన తరువాత కూడా ఆయనకి సమయం సరిపోవడంలేదు. రోజుకి 48 గంటలు ఉంటే బాగుంటుందేమో అన్నట్లుగా ఆయనని ఆయన బిజీగా పెట్టుకుంటున్నారు. తాజాగా నెల్లూరు, చెన్నై నగరాలలో 5 రోజులపాటు సాగిన ఆయన పర్యటనే ఇందుకు పెద్ద ఉదాహరణ.*



తన పర్యటనలో భాగంగా మార్చి 8న వెంకయ్యనాయుడు నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో రత్నం విద్యాసంస్థల అధినేత కెవి రత్నం మనుమడి వివాహం సందర్భంగా జరిగిన సంగీత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. రెండవరోజు మార్చి 9వ తేదిన ఉదయం తన సమీపబంధువు సుబ్బానాయుడు-సత్యవతిల కుమార్తె శ్రావణి-హరిచరణ్‌ల పెళ్ళి వేడుకకు సకుటుంబ సపరివారంగా హాజరయ్యారు. మూడవరోజు 10న, స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. స్వర్ణభారత్ ట్రస్ట్, మెడికవర్ హాస్పిటల్ సంయుక్త నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, ప్రాథమికంగా విద్య, వైద్యం మీద కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని, ఉచిత పథకాల కంటే ఉచిత విద్య, ఉచిత వైద్యాన్ని ప్రజలకు అందించి మౌలిక సదుపాయాలు పెంచటం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని సూచించారు. ఈ సందర్భంగా స్వర్ణభారత్ ట్రస్టీగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన తర్వాత, ఈ వైద్య శిబిరానికి భర్తతో పాటు విచ్చేసిన మనుమరాలు (కుమార్తె దీపావెంకట్ గారి కూతురు) సుష్మా కిషన్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, స్వర్ణభారత్ ట్రస్టీ సుష్మా కిషన్‌తోపాటు మెడికవర్ హాస్పిటల్స్ నిర్వాహకులు, డాక్టర్లు పాల్గొన్నారు. అదేరోజు మధ్యాహ్నం బయలుదేరి ఆయన చెన్నైకి వెళ్ళారు.



### చెన్నైలో 'కీరా' శతజయంతి ఉత్సవాల్లో...

నాల్గవ రోజు 11వ తేదీన వెంకయ్యనాయుడు చెన్నైలో పర్యటించారు. చెన్నైలోని కెన్సస్ సంస్థల అధినేత కొండ్లపూడి నరసారెడ్డి కుమార్తె పెళ్ళివేడుకల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత తమ ఆత్మీయులైన తమ్మిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డిని చెన్నైలోని ఆయన ఇంటికి వెళ్ళి కలుసుకున్నారు. తిరుపతి జిల్లా కోటకు చెందిన వేణుగోపాల్‌రెడ్డి జిల్లాకు చెందిన సంఘ ప్రముఖులు. ఇప్పుడాయన వయసు 92 సంవత్సరాలు. నీతినిజాయితీలకు ప్రతీకగా ఉండే అలాంటి పెద్దల సాన్నిహిత్యమే తమ ఎదుగుదలకు ఉపయోగపడిందని వెంకయ్యనాయుడు ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

ఆ తర్వాత చెన్నై మ్యూజిక్ అకాడమీలో జరిగిన సేఫియన్స్ హెల్త్ ఫౌండేషన్ రజతోత్సవాల్లో సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడుతూ, వెంకయ్యనాయుడుకు ఉప రాష్ట్రపతి పదవి ఇవ్వడం తనకు నచ్చలేదని, ఆ పదవితో గొప్ప నాయకుడిని రాజకీయాల నుంచి దూరం చేశారని చేసిన వ్యాఖ్యలు కలకలం సృష్టించాయి. ఈ కార్యక్రమంలో ఆ ఫౌండేషన్ ఛైర్మెన్ డాక్టర్ రాజన్ రవిచంద్రన్, ట్రస్టీ సుందర్ తదితరులు పాల్గొన్నారు.




అనంతరం, ఈనెల 13న సోమవారం నాడు చెన్నైలోని ఎంజిఆర్ జానకి ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల ఆవరణంలో జరిగిన ప్రముఖ తమిళ రచయిత కె.రాజనారాయణ(కీరా) శతజయంతోత్సవాల్లో పాల్గొని ఆయన రచించిన వంద వ్యాసాల పుస్తకాన్ని వెంకయ్య ఆవిష్కరించి ప్రసంగించారు. నిర్వాహకులు కెఎస్ రాధాకృష్ణన్, బిజెపి తమిళనాడు ఉపాధ్యక్షులు చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కీరా రాసిన నవలలను తెలుగులోకి అనువదించడానికి సహకరించిన హైదరాబాద్ నివాసి సగిలి సుధారాణిని కూడా ఘనంగా సత్కరించారు.

ఇటు సొంత జిల్లా నెల్లూరులోను, అటు మద్రాసు నగరంలోనూ ఆయన క్షణం తీరికలేకుండా గడిపారు.

---

మార్చి 19న.. నెల్లూరు విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో

## ప్రపంచ తెలుగు సమాఖ్య ఉగాది వేడుకలు

ఉగాది పండుగ సందర్భంగా ప్రపంచ తెలుగు సమాఖ్య (చెన్నై) నెల్లూరు ప్రాంతీయ కమిటీ నిర్వహణలో మార్చి 19న శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను నిర్వహించనుంది. నెల్లూరు సమీపంలోని గొలగమూడిరోడ్డులో ఉన్న విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ఈ వేడుకలకు ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలు డా.విఎల్ ఇందిరాదత్, ముఖ్య అతిథిగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, గౌరవ అతిథిగా రాజ్యసభ సభ్యులు..ప్రపంచ తెలుగు సమాఖ్య ఉపాధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొంటారని ఆ సంస్థ నెల్లూరు ప్రాంతీయ కమిటీ అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు తెలిపారు. సాయంత్రం 4.30 గంటల నుండి జరిగే వేడుకల్లో సురభి గాయత్రి శిష్య బృందంచే కూచిపూడి నృత్యం, కెఎస్ రాఘవాచార్యులు ఉగాది పంచాంగపఠనం, ఆచార్య ఫణీంద్ర సారథ్యంలో 'తెలుగు భాషా వైభవం' సాహిత్య రూపకం ప్రదర్శన ఉంటాయని.. తెలుగుభాషాభిమానులు, సాహిత్యాభిలాషులు, కళాభిమానులు తరలి వచ్చి ఈ వేడుకలను జయప్రదం చేయాలని బలరామయ్య కోరుతున్నారు.

### 'శోభకృత్'కు.. స్వాగతం



వత్సరమ్ములు, రుతువులు వసుధ యందు
కాల గమనాన నిలిచి సాక్ష్యములు గాగ
ప్రజల సంక్షేమమె ప్రకృతి బాధ్యతనుచు
అరువదేండ్ల కొకపరి అరుగుదెంచి
వసుధ పండుగై 'శోభకృత్' పలుకరించు!
తెలుగు లోగిళ్ళు, భూములు తేజరిల్ల
జలకళలతోడ వనరులు జగతి నిండ
అన్నదాతగా రైతన్న అలరవలయు!
కవులు గాయకుల్ పంచాంగకర్తలెల్ల
సహజ సౌభాగ్యరీతుల సంతరించ
కష్టనష్టముల్ జనులకు కలుగకుండ
పుష్టితుష్టులునందించి పులకరింప
సాగిరావమ్మ 'శోభకృత్' స్వాగతమ్ము!

**వనం సుబ్రహ్మణ్యం**
94415 94897

---

జొన్నవాడలో

### నిత్యాన్నదానానికి.. విరాళం

బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకం కోసం నెల్లూరుకు చెందిన దాతలు వేటూరు చంద్రశేఖర్‌రెడ్డి- అపర్ణమ్మ దంపతులు తమ కుటుంబసభ్యులతో కలసి లక్షా7వేలా 436రూపాయలను విరాళంగా అందజేశారు. ఆలయ నిర్వాహకులకు ఈనెల 12న ఆ మొత్తం అందించారు.

### ధాన్యాన్ని వెంటనే కొనాలి

జిల్లాకు ఈనెల 16 నుంచి వర్షసూచన ఉందని తెలుస్తున్న నేపథ్యంలో, రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలని రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి కోరారు. ఆ మేరకు ఈనెల 12న కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబుకు వినతి పత్రం అందజేశారు.

### కానిస్టేబుల్ కన్నుమూత

బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ పి.మల్లికార్జున ఈనెల 12న అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మరణానికి చింతిస్తూ, వారి కుటుంబసభ్యులకు పోలీసు అధికారుల సంఘం నాయకులు వై.శ్రీహరి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

---

## సముద్రాల లక్ష్మణయ్య..ఇక లేరు



టిటిడి హిందూ ధర్మప్రచారపరిషత్ విశ్రాంత కార్యదర్శి, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, సాహితీ శిరోమణి.. మహామహోపాధ్యాయ బిరుదాంకితులు సముద్రాల లక్ష్మణయ్య(86) ఈనెల 13వతేది రాత్రి అనారోగ్యంతో కన్ను మూశారు. ఆయన స్వస్థలం తిరుపతి జిల్లా ఏర్పేడు మండలంలోని 'కాత్రాయగుంట' గ్రామం. ఏర్పేడు వ్యాసాశ్రమంలో మలయాళస్వామి వారి వద్ద విద్యనభ్యసించారు. ప్రైవేటుగా ఎంఏ పూర్తిచేశాక, నెల్లూరుజిల్లా కోట మండలంలోని కొత్తపాళెంలో సంస్కృత ఉపాధ్యాయునిగా కొంతకాలం పనిచేశారు. అనంతరం, తిరుమల తిరుపతి దేవస్థానాల హిందూ ధర్మప్రచార పరిషత్ కార్యదర్శిగా సుదీర్ఘకాలం సేవలందించారు. ఆ పదవిలో ఆయన రిటైరైనా, టిటిడి వారు ఆయన్ను వదులుకోలేక, పురాణ ఇతిహాస ప్రాజెక్టు డైరెక్టర్‌గా కొనసాగించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన ఇక లేకపోవడం.. టిటిడికే కాదు, ఆధ్యాత్మిక-సాహిత్యరంగాలకి కూడా తీరని లోటు.

## పోలవరం ప్రాజెక్టు ఇఇ.. గుండెపోటుతో మృతి



ఆదిరెడ్డి

పోలవరం ప్రాజెక్టు డివిజన్-1లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న మన నెల్లూరుజిల్లా కావలి వాస్తవ్యుడు పొనుగోటి ఆదిరెడ్డి ఈనెల 13న గుండెపోటుతో మరణించారు. జలవనరుల శాఖలో నెల్లూరు-ప్రకాశం జిల్లాల్లో సుదీర్ఘకాలం పనిచేసి, ఉద్యోగోన్నతిపై పోలవరం ప్రాజెక్టుకు బదిలీ అయ్యారు. విధులు నిర్వహించేందుకు సోమవారం పోలవరానికి వెళ్ళి తన కార్యాలయంలో కాసేపు విశ్రమించిన తర్వాత, భోజనం ఏర్పాటు చేయమని సిబ్బందికి చెప్పిన కొద్దిసేపటికే కుర్చీలో వాలిపోయారు. అది గమనించిన సిబ్బంది వెంటనే ఆసుపత్రికి తరలించారు. కానీ, అప్పటికే ఆయన గుండెపోటుతో మృతిచెందినట్లు డాక్టర్లు చెప్పారు. అనంతరం, భౌతికకాయాన్ని అంబులెన్స్‌లో కావలికి పంపారు. ఆదిరెడ్డికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వచ్చే ఏడాదే పదవీ విరమణ చేయనుండగా, హటాత్తుగా గుండెపోటుతో కన్నుమూయడంతో ఆయన కుటుంబసభ్యుల వేదనారోదనలు వర్ణనాతీతం.

# ఉపాధి నిధులు ఏపీకి ఎప్పుడిస్తారు?



## రాజ్యసభలో విపిఆర్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం యొక్క మెటీరియల్ కాంపోనెంట్ కింద ఆంధ్రప్రదేశ్‌కు ప్రభుత్వం రూ.700 కోట్లు చెల్లించాల్సి ఉందనే విషయం వాస్తవమేనా? అయితే ఆ నిధులెప్పుడిస్తారని ఈనెల 15న పార్లమెంట్‌లో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (విపిఆర్) ప్రశ్నించారు. అందుకు స్పందించిన కేంద్రమంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ. 6706.08 కోట్లు ఎన్ఆర్ఇజిఎస్ పథకం కింద విడుదలయ్యాయని, ఇందులో మెటీరియల్ కోసం మరియు పరిపాలనా విభాగాల కోసం రూ.2363.46 కోట్లతో సహా, ఈ పథకం కింద, మొత్తం రూ.819.12 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ కోసం పెండింగ్‌లో ఉన్నాయని, వేతనాలకు సంబంధించి రూ.205.24 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రాలకు నిధుల విడుదల అనేది ఒక నిరంతర ప్రక్రియ అని, కేంద్ర ప్రభుత్వం, ఎన్ఆర్ఇజిఎస్ పథకం అమలుకు రాష్ట్రాలకు నిధులను అందుబాటులో ఉంచడానికి కట్టుబడి ఉందని తెలిపారు.

### పెట్రోకెమికల్ కాంప్లెక్ విషయం ఏమిటి?..

ఏపీలో పెట్రోకెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు ప్రతిపాదనలకు సంబంధించి కేంద్రం తీసుకుంటున్న చర్యలేమిటని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 13న పార్లమెంట్‌లో ప్రశ్నల వర్షం కురిపించారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014 ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోకెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆదేశించడం వాస్తవమేనా?.. రాష్ట్రం నుండి వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (విజిఎఫ్) గురించి చట్టం తెలియపరచలేదనే విషయం కూడా వాస్తవమేనా? అని ఆయన ప్రశ్నించారు. అందుకు సంబంధించిన వివరాలను తెలపాలంటూ ఆయన కేంద్రాన్ని లిఖితపూర్వకంగా కోరారు. అందుకు స్పందించిన కేంద్రమంత్రి రామేశ్వర్ తెలి సమాధానమిస్తూ, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014 లో అంతర్లీనంగా ఐఓసి లేదా హెచ్‌పిసిఎల్ నియమితరోజు నుండి 6 నెలల లోపల, దాని ఏర్పాటు యొక్క సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని, గ్రీన్‌ఫీల్డ్ ముడి చమురు శుద్ధి కర్మాగారం మరియు పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రారంభించేందుకు దానిపై వేగవంతమైన నిర్ణయం తీసుకోవాలని పేర్కొనడం జరిగిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కాకినాడ వద్ద పెట్రోకెమికల్ కాంప్లెక్స్ కోసం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గెయిల్ (ఇండియా) లిమిటెడ్ మరియు హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లతో 27.01.2017న ఒప్పందంపై సంతకం చేయడం జరిగిందని, ప్రాజెక్ట్‌ను నెలకొల్పడానికి ఒక వివరణాత్మక అధ్యయనం (వయబిలిటీ గ్యాప్ ఫండింగ్) అవసరమని నిర్ధారించిందని తెలిపారు. దాంతోపాటు ప్రాజెక్ట్ ఆర్థిక అంశాలు 2017లో ఏపీ ప్రభుత్వంతో ఖరారు చేయడం, అంగీకరించబడడం జరిగాయని వివరించారు.

### బొగ్గు కొరత తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నారా?..

ఈ వేసవిలో విద్యుత్ రంగానికి బొగ్గు కొరత ఏర్పడే అవకాశం ఉందా?.. అయితే, కొరత నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారని ఈనెల 14న విపిఆర్ పార్లమెంట్‌లో అడిగారు. అందుకు కేంద్ర మంత్రి ఆర్.కె.సింగ్ సమాధానమిస్తూ, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ దేశంలోని బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ ప్లాంట్ల యొక్క బొగ్గు స్టాక్ స్థితిని రోజువారీగా పర్యవేక్షిస్తుందని, బొగ్గుకొరత తీర్చడానికి కేంద్రం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఎన్‌టిపిసి 2023–24 ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలో దేశీయ బొగ్గు సరఫరా కొరతను తీర్చడం కోసం తన గ్రూప్ స్టేషన్లకు దాదాపు 5.4 మిలియన్ టన్నుల బొగ్గును దిగుమతి చేసుకోవాలని యోచిస్తోందని తెలిపారు.



## ప్రశాంత్‌రెడ్డి - డా. సాయిబిందు

2009 ప్రాంతంలో నెల్లూరు జిల్లా ఎస్.పిగా సేవలందించి, ఆ తరువాత రాష్ట్ర విభజనలో తెలంగాణకు వెళ్ళి, అక్కడ ఐ.జిగా పదవీ విరమణ పొంది, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ ట్రాన్స్‌కో విజిలెన్స్ విభాగంలో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రిటైర్డ్ ఐపీఎస్ అధికారి బుసిరెడ్డి మల్లారెడ్డి - సరితల రెండవ కుమారుడు **ప్రశాంత్‌రెడ్డి - సాయిబిందు** (బెంగళూరు వాస్తవ్యులు భాస్కరరెడ్డి - శోభల కుమార్తెల పెళ్ళి వేడుక మార్చి11 బెంగళూరులోనూ, రిసెప్షన్ మార్చి14న హైదరాబాదులోను జరిగాయి. నూతన జంటకి 'లాయర్' శుభదీవెనలు.

# తల్లికి తగ్గ తనయ డాక్టర్ శ్రియ



గత కొన్ని దశాబ్దాలుగా నెల్లూరు వైద్యరంగంలో డాక్టర్ చంద్రసేన–ధనుంజయ దంపతులను తెలియని వారుండరు. పొగతోటలో వారి ఆధ్వర్యంలో చిరకాలంగా నడుస్తున్న సింహపురి స్కానింగ్ సెంటర్ కూడా అంతే ప్రసిద్ధి. ఇప్పుడు వారి రెండవ కుమార్తె డాక్టర్ వంజవాకం శ్రియ కూడా తన తల్లికి తగ్గ తనయగా గుర్తింపు తెచ్చుకుంటున్నారు. నారాయణ మెడికల్ కాలేజీలో వైద్యశాస్త్రంలో పట్టా పొందిన శ్రియ మార్చి 15వతేది బుధవారం జరిగిన కాన్వొకేషన్ కార్యక్రమంలో రెండు రాష్ట్రస్థాయి ర్యాంకులతో పాటు ఒక బంగారు పతకం కలిపి మొత్తం 3 పతకాలు సాధించి తన మేధస్సును చాటుకుంది. ముందుగా ఎం.బి.బి.ఎస్ తొలి ఏడాదిలో ఉత్తమ విద్యార్థినిగా రాష్ట్రస్థాయిలో 9వర్యాంకు సాధించగా, చివరి ఏడాదికి గాను 10వ ర్యాంకు పొందడంతో పాటు ప్రసూతి విభాగానికి సంబంధించి గైనకాలజీలో బంగారు పతాకాన్ని అందుకుంది. మొత్తంమీద మూడు పతకాలను తన ఖాతాలో వేసుకుని తమ అమ్మానాన్నలకు, చదువు చెప్పిన గురువులకి శ్రియ గర్వకారణంగా నిలిచింది. డాక్టర్ శ్రియకి 'లాయర్' అభినందనలు.

# వేసవిలో జాగ్రత్త!

ఈ మండు వేసవి కాలంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఎండల్లో తిరగకుండా నీడపట్టున ఉండాలని, ముఖ్యంగా మజ్జిగ, చల్లనీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తీసుకుంటూ ఆరోగ్యానికి ఇబ్బందిలేకుండా చూసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య సూచించారు. ఉదయగిరిలో ఈనెల 15న ఆయన సచివాలయాన్ని సందర్శించారు. జిల్లాలో స్వైన్‌ఫ్లూ లక్షణాలు లేవని, ప్రజలు వ్యాధులు రాకుండా ముందుజాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.



# సుబ్బన్న పెళ్ళిలో వెంకన్న కుటుంబం



భారత 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు - ఉషమ్మల సమీప బంధువు, వెంకయ్య కుమార్తె దీపమ్మ మామా అని ఆప్యాయంగా పిలుచుకునే సుబ్బానాయుడు - సత్యవతిల కుమార్తె **శ్రావణి - హరిచరణ్** (నెల్లూరు వాస్తవ్యులు వెంకటేశ్వర్లు - పద్మావతిల కుమారుడు)ల కళ్యాణం మార్చి 9వతేది ఉదయం నెల్లూరులో జరిగింది. వెంకయ్య-ఉషమ్మ దంపతులతో పాటు వారి కుటుంబ సభ్యులు, ఇరు కుటుంబాల బంధుమిత్రులు ఈ వేడుకలో పాల్గొని కొత్త జంటను దీవించారు. శ్రావణి - హరిచరణ్‌లకు 'లాయర్' శుభదీవెనలు.

# ఆనం వారి కళ్యాణం



ఆనం సోదరులలో ఒకరైన ఆనం జయకుమార్‌రెడ్డి - ఉమామల్లికల కుమార్తె **చెంచుశార్వరి - అనురాగ్‌రెడ్డి** (హైదరాబాద్ వాస్తవ్యులు కోటిరెడ్డి - పద్మల కుమారుడు)ల కళ్యాణం మార్చి 9వతేదీ హైదరాబాదులో వైభవంగా జరిగింది. రాజకీయ రంగానికి చెందిన అనేక మంది ప్రముఖులతో పాటు ఆనం కుటుంబ ఆప్తులు, అనుచరులు ఈ శుభవేడుకలో పాల్గొని నవ జంటను దీవించారు. కొత్త దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.

## శ్రీసిటీలో తమిళనాడు మాజీ ప్రధాన కార్యదర్శి

తమిళనాడు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పి.రామమోహనరావు ఈ నెల 14న శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు స్వాగతం పలికి శ్రీసిటీ గురించి వివరించారు. శ్రీసిటీ యొక్క వేగవంతమైన పురోగతిని రామమోహనరావు ప్రశంసించారు.




# ఎన్‌బికెఆర్‌లో జాతీయస్థాయి సాంకేతిక సదస్సు



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇటీవల ఇసిఇ విభాగం ఆధ్వర్యంలో జాతీయస్థాయి సాంకేతిక, వైజ్ఞానిక సదస్సు జరిగింది. విద్యార్థులు ఆత్మవిశ్వాసాన్ని, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని, ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని వీలైనంత త్వరగా అందిపుచ్చుకుని, నైపుణ్యంతో రాణించి మంచి ఉద్యోగాలు పొందాలని ఈ సదస్సులో పాల్గొన్న విభాగాధిపతి డా.హరినాథరెడ్డి విద్యార్థులకు సూచించారు. ఈ సదస్సులో 120కి పైగా సాంకేతిక పత్రాలను విద్యార్థులు సమర్పించారని సమన్వయకర్త డా.జి. కామేశ్వరి తెలిపారు. పేపర్, పోస్టర్ ప్రెజెంటేషన్లతో పాటు, స్పాట్ ఈవెంట్స్, ప్రాజెక్టు ఎక్స్‌పో నిర్వహించి, ఉత్తమ ప్రదర్శనకు బహుమతులందజేస్తామన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు తగు సూచనలిచ్చారు. విద్యార్థులకు ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలకు కళాశాల తనవంతు సహకారం ఎల్లవేళలా అందిస్తూనే ఉంటుందని ఆయన చెప్పారు. ఇసిఇ అసోసియేషన్ ఇన్‌చార్జి జి.నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు రామ్‌కుమార్‌రెడ్డి అభినందనలు



మార్చి మొదటివారంలో జరిగిన అంతర్‌కళాశాలల క్రీడా పోటీల్లో జెఎన్‌టియుఏ స్థాయిలో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన తమ కళాశాల విద్యార్థులను ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి అభినందించారు. ఇటీవల కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. క్రీడలు విద్యార్థుల శారీరక దారుఢ్యానికి, మానసిక వికాసానికి ఎంతగానో దోహదం చేస్తాయని, విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు అవసరమైన ఆధునిక వసతులన్నీ సమకూరుస్తామని తెలిపారు. క్రీడల్లో విజేతలతో పాటు, వ్యాయామ ఉపాధ్యాయుల కృషిని కూడా ఆయన ప్రశంసించారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# గంజాయి స్మగ్లర్ల అరెస్టు



తిరుపతి జిల్లా గూడూరు రెండవ పట్టణంలోని దిగువ వీరారెడ్డిపల్లి ప్రాంతంలో ఈ నెల 13న నిషేదిత గంజాయిని సరఫరా చేస్తున్న ముగ్గురు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నామని గూడూరు సెబ్ సి.ఐ విజయకుమార్ తెలిపారు. పత్రికా విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా సెబ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గూడూరు రెండవ పట్టణంలోని దిగువ వీరారెడ్డిపల్లి ప్రాంతంలో నివసిస్తున్న షేక్ అబ్దుల్ రహీం ఇంట్లో సోదాలు నిర్వహించి 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొన్నామని, అతనికి గంజాయిని సరఫరా చేసిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన మల్లోజు స్వరూపా, తూర్పాటి రాములును అరెస్టు చేశామన్నారు. విచారణలో తుని, నర్సీపట్నం ప్రాంతాల నుండి గంజాయిని తీసుకొచ్చి అబ్దుల్ రహీం ద్వారా అమ్మకాలు జరుపుతున్నారని తెలిసిందని, నిందితులపై కేసు నమోదుచేసి గూడూరు కోర్టుకు హాజరుపరుస్తున్నామని ఆయన తెలిపారు. ఎస్సై శేషమ్మ, హెడ్‌కానిస్టేబుల్ కిరణ్ సింగ్, కానిస్టేబుళ్ళు రమేష్, ప్రసాద్, రాంప్రసాద్, భాషా, రవి, కృష్ణయ్యలు పాల్గొన్నారు.

# ఘనంగా వైకాపా ఆవిర్భావ వేడుకలు

వైకాపా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఈనెల 12న గూడూరులో పట్టణ పార్టీ అధ్యక్షుడు బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ పాల్గొని దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. పురపాలక సంఘం మాజీ ఛైర్‌పర్సన్ కోడూరు కల్పలత కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచారు. కోడూరు మీరారెడ్డి, బత్తిని విజయకుమార్, మాజీ కౌన్సిలర్ సుకన్య, కోదండరామయ్య పాల్గొన్నారు.

# తైక్వాండోలో మెరిసిన గూడూరు బాలుడు




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల విశాఖపట్నం జిల్లా, ఎలమంచిలి వాగ్దేవి జూనియర్ కాలేజీలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సబ్ జూనియర్, 5వకాడేట్ ఇంటర్ డిస్ట్రిక్ పోటీలలో గూడూరు పట్టణ ఎగువ వీరారెడ్డిపల్లికి చెందిన మూర్తేష్ సాయిసింగ్ తృతీయ స్థానంలో నిలిచి కంచు మెడల్‌ను గెలుపొందాడు. ఇంతటి ప్రతిభ కనబరిచిన మూర్తిష్ సాయి సింగ్‌ను ఈ సందర్భంగా తైక్వాండో మాస్టర్ అభినందించి, భవిష్యత్తులో మరెన్నో బంగారు పతకాలను గెలుచుకొని గూడూరుకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకుని రావాలని ఆకాంక్షించారు.

# నిరుపేదలకు రోటరీ చేయూత



తిరుపతి జిల్లా గూడూరు రోటరీ క్లబ్ గూడూర్ వెస్ట్ ఆధ్వర్యంలో డిఎన్‌ఆర్ కమ్యూనిటీ హాల్ నందు ఇటీవల 16 మంది నిరుపేదలకు రోటరీ చేయూత ద్వారా పలసరుకుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి దాతగా శ్రీ కోదండ రామాంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ తాళ్లూరి శ్రీనివాసులు వ్యవహరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బండి ధనుంజయరెడ్డి, రొటేరియన్స్ వాసు గౌడ్, సిద్ధారెడ్డి హరినాథ్‌రెడ్డి, విజయమోహన్‌రెడ్డి, బలరాంరెడ్డి పాల్గొన్నారు.

# భక్తిపూర్వకంగా ముత్యాలమ్మ జాతర



చిల్లకూరు మండలం, తూర్పు కనుపూరు గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఈనెల 14 నుండి 17వతేదీ వరకు జాతర మహోత్సవం జరుగనుంది. 14వ తేదీ జాతర ప్రారంభమవగా, సాయంత్రం అమ్మవారి నిలుపు, సింహవాహన సేవ, 15వ తేదీ యార ఉత్సవం, గొల్లల వేడుకలు, 16వ తేదీ శ్రీ గురునాథస్వామి ఉత్సవం కన్నుల పండువగా జరిగాయి. జాతరలో చివరిరోజైన 17వ తేదీన శ్రీ పోలేరమ్మను వెళ్ళనంపు ఉత్సవం జరుగనుంది. జాతర సందర్భంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.

# పుట్టినరోజున 'ప్రగతి' చంద్రశేఖర్ సేవలు



గూడూరు ప్రగతి సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ పుట్టినరోజు సందర్భంగా ఈనెల 14వతేదీ బాలాజీ నగర్‌లోని 'ప్రగతి' కార్యాలయంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, ప్రగతి సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషుల సమక్షంలో కేక్ కట్ చేసి సేవా కార్యక్రమాలు చేపట్టారు. 50 మంది నిరుపేద మహిళలకు చీర జాకెట్, బిర్యానీ పంపిణీ చేశారు. అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు బండి ధనుంజయరెడ్డి, సెక్రటరీ జి.చంద్రశేఖర్, జాయింట్ సెక్రెటరీ కే.శ్రీనివాసులు, వేమారెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సులో..
# గంజాయి పట్టివేత

నెల్లూరు నగరంలో విక్రయించేందుకు ఆర్టీసి బస్సులో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు నిందితులను సెబ్ అధికారులు పట్టుకున్నారు. కావలి మండలం ముసునూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలో, 19కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరిం టెండెంట్ ఎస్.రవికుమార్ నెల్లూరు-1 సెబ్ కార్యాలయంలో ఈనెల 13న ఆ వివరాలను వెల్లడించారు. జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు, జిల్లా సెబ్ అధికారి శ్రీనివాసాచారి ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా వాహనాల తనిఖీలు చేశామని, తమిళనాడుకు చెందిన పి.కృష్ణ, నెల్లూరుకు చెందిన షేక్ తన్వీర్‌లు గంజాయి ప్యాకెట్లను బస్సులో తరలిస్తుండగా గుర్తించి పట్టుకోవడం జరిగిం దని చెప్పారు. విజయవాడకు చెందిన ఓ మహిళ వద్ద గంజాయిని కొనుగోలు చేసినట్లు తెలిసిందన్నారు. ఆ మహిళ కోసం గాలిస్తున్నా మని చెప్పారు. పట్టుబడిన ఇద్దరూ పాత నేరస్తులేనని, కావలి సెబ్ సిఐ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారిని పట్టుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా, గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని ప్యాకెట్లలో పెట్టి విక్రయిస్తున్న నెల్లూరు శ్రామికనగర్‌కు చెందిన వి.రాజా, పడారుపల్లి నివాసి టి.సుబ్రహ్మణ్యంలను అరెస్ట్ చేశామని, వారి వద్ద నుంచి 7 కేజీల గంజాయిని, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఏఇఎస్ కృష్ణ కిశోర్‌రెడ్డి, డిఎస్ఇఓ పోలీస్ ఇన్స్‌పెక్టర్ హుస్సేన్‌బాషా, కావలి, నెల్లూరు-1 సబ్‌ఇన్స్ పెక్టర్‌లు కె.శ్రీనివాసరావు, కెపి కిషోర్, ఎస్‌ఐలు బాల కృష్ణ, గోపీనాథ్, శ్రీనివాసరావు, డి.శ్రీధర్‌లను జిల్లా ఎస్పీ అభినందించారని ఆయన తెలిపారు.

## కడనూతలలో ప్రాంగణ ఎంపికలు



బోగోలు మండలంలోని కడనూతలలో ఉన్న ఆర్ఎస్ఆర్ కళాశాలలో ఇటీవల బెంగుళూరుకు చెందిన ట్యాప్ అకాడమీ సంస్థ వారు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. మొత్తం 135 మంది విద్యార్థులు పాల్గొంటే, పరీక్షల్లో 14 మంది ఎంపికయ్యారు. ఆర్ఎస్ఆర్ నుంచి 9 మంది, కావలి డిబిఎస్ కళాశాల విద్యార్థులు అయిదుగురు ఎంపికైన వారిలో ఉన్నారని, ఎంపికైన విద్యార్థులకు శిక్షణ అనంతరం ఉద్యోగాలు ఇస్తారని ప్రిన్సిపాల్ డా.పి.వీరనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ రాజారెడ్డి అభినందించారు. ఏఓ ఆర్‌వి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది వచ్చే వేళ



వసంత ఋతువు ఆగమన వేళ
శోభకృత్ వత్సరానికి పసందైన వేళ
మామిడి ఆకుల చాటున కోయిలలు ఆడేవేళ
గూటిలోని కోయిలమ్మ గొంతు విప్పి పాడే వేళ

తరులు విరుల తావులనే నిదుర రేపే వేళ
వసుధ లోని అందాలనే పసిడి వన్నె కాంతులు గా
సూర్య రశ్మి శోభలో మెరిసి మురిసేటి వేళ
మల్లె జాజి పువ్వులే విరిసి మదిలోన కోరిక రేపే వేళ

పరిమళాల తేనెలనే పెదవి పైకి రానిచ్చే వేళ
కొండగాలి అలజడిలో
చల్లగాలి ఊయలూపి
మరులు గొలిపే రాగ భావం
మంజులంగ పలికే వేళ



కలలు కనెడి ప్రకృతి కాంత
డెందమందు ఆశలు పెంచి
పరవశాన ఊహలలో
దరహాస మొందేటి వేళ

ఏడాదికి వచ్చేటి ఉగాది వేళ
కాలగమనానికి పునాది వేసే వేళ

దూబగుంట రామకృష్ణ
తిరుపతి. 9490108518



## సింహపురి సంస్కృతి సమాఖ్య.. 'ఉగాది పురస్కారాలు'

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని సింహపురి సంస్కృతి సమాఖ్య వ్యవస్థాపక కార్యదర్శి రాంజీ ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక టౌన్‌హాల్‌లో పెద్దఎత్తున వేడుకలు జరిగాయి. ఎస్‌వి యూనివర్సిటీ పూర్వ వైస్‌చాన్సలర్ ఆచార్య కొలకలూరి ఇనాక్, టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు పూర్వ డైరెక్టర్ డా.మేడసాని మోహన్, ప్రముఖ సినీ హీరో సుమన్, తిరుపతి విమానాశ్రయం డైరెక్టర్ ఎం.రాజకిషోర్, డా.కొండూరు హరినారాయణరెడ్డి, ఈదా శ్యామ్యూల్‌రెడ్డి (గుంటూరు) తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని 'రసమయి' సంస్థ అధ్యక్షులు, ప్రముఖ కవి, లలితగీతాల రచయిత డా.ఎంకె రాముకు ముఖ్య అతిథులు చేతులమీదుగా జీవిత సాఫల్యపురస్కారాన్ని ప్రదానం చేసి, స్వర్ణ కంకణాన్ని బహూకరించారు. అనంతరం, పాయసం వెంకటేశ్వరరావు (మునిసిపల్ కమిషనర్-ఉయ్యూరు), గుంజి నరసింహారావు (న్యూఢిల్లీ), బడితల శ్రీనివాసరావు(నెల్లూరు వైద్యారోగ్యశాఖ), డాక్టర్ మాదాల వెంకటేశ్వర రావు (నెల్లూరు), డాక్టర్ పోకల రవి, 'నుడా' పూర్వ డైరెక్టర్ షేక్ ఖాజావలి, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ పూర్వ సీనియర్ మేనేజర్ బొగ్గవరపు శ్రీమన్నారాయణ, కొరియోగ్రాఫర్ ఎస్‌కె బాబు (నెల్లూరు)లకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. విశ్రాంత ఎమ్మార్వో ఎస్. మల్లికార్జునరావు, ప్రపంచ తెలుగు సమాఖ్య ప్రాంతీయ అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు, వివిపు లలితారామ్, నందివెలుగు మహదేవశాస్త్రి పాల్గొన్నారు.

## పెంచలకోనలో.. నేత్రపర్వంగా 'స్వర్ణ గరుడసేవ'



శ్రీవారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా పెంచలకోనలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామికి ఆలయ అర్చకులు పెద్దఎత్తున పూజలు చేశారు. మూలవిరాట్‌కు ప్రత్యేకపూజలు, అభిషేకాలు చేసిన, అనంతరం చందనాలంకార సేవ, దేవేరులతో స్వామివారికి కల్యాణోత్సవం కన్నులపండువుగా నిర్వహించారు. రాత్రి స్వర్ణ గరుడవాహనంపై స్వామివారిని కొలువుదీర్చి ఆస్థానసేవ, క్షేత్రోత్సవం వైభవంగా చేశారు. ఆలయ ఛైర్మన్ చెన్న తిరుపాల్‌రెడ్డి, ఇఓ జనార్దన్‌రెడ్డి ఈ వేడుకలను పర్యవేక్షించారు.

### నరసింహకొండపై...

నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండపై కొలువై ఉన్న శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఈనెల 11న స్వామివారి జన్మనక్షత్రం 'స్వాతి నక్షత్ర' పూజలు విశేషంగా జరిగాయి. తొలుత ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని శోభాయమానంగా అలంకరించి విశేష పూజలు, పంచామృతా భిషేకాలు చేశారు. ఈ సందర్భంగా నైమిశారణ్య పీఠాధిపతి బాలబ్రహ్మసరస్వతిస్వామి వారు ఆలయాన్ని సందర్శించి, స్వామివారి ఆవిర్భావఘట్టాలను ప్రవచించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఛైర్మన్ సురేంద్రరెడ్డి, ఇఓ గిరికృష్ణ పర్యవేక్షించారు.

## చదువుతోనే మంచి భవిష్యత్తు

బాగా చదువుకుంటేనే మంచి భవిష్యత్తు ఉంటుందని, విద్యార్థినులంతా కష్టపడి బాగా చదువుకుని సమాజంలో ఉన్నతస్థాయిలో రాణించాలని మనుబోలు ఎస్ఐ ముత్యాల రావు చెప్పారు. ఇటీవల మనుబోలులోని ప్రభుత్వ బాలికల వసతిగృహంలో దాత యనమల అంకయ్య సహకారంతో విద్యార్థినులకు పరీక్షా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడుతూ, విద్యాభివృద్ధికి, ముఖ్యంగా పేదవిద్యార్థుల చదువుకు దాతలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలను ఆయన అభినందించారు. ప్రభుత్వ వైద్యాధికారి గేయపూజిత, ఏఎన్ఎం సుభాషిణి, హెచ్‌డబ్ల్యూఓ మహేశ్వరి, పద్మావతి సూపర్‌మార్కెట్ అధినేత సుధీర్, జగదీష్‌బాబు పాల్గొన్నారు.

## 10వ తరగతి విద్యార్థులకు.. విద్యాసామగ్రి




చేజర్ల మండలంలోని చేజర్ల, ఆదూరుపల్లి, నాగులవెల్లటూరు, తూర్పుకంభంపాడు, తూర్పుపల్లి, మాముడూరుల్లోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలు, ఆదూరుపల్లి అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న 10వ తరగతి విద్యార్థులకు రెడ్డివారికండ్రిక‌కు చెందిన దాత పలసాని సురేష్‌రెడ్డి విద్యాపరికరాలను వితరణగా అందజేశారు. 320 మంది విద్యార్థులకు అవసరమైన పరీక్షల ప్యాడ్స్, పెన్స్ వగైరాలను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శైలజకుమారి, వైస్ ప్రిన్సిపాల్ నాగలతతో పాటు మల్లికార్జునరావు, శ్రీనివాసులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...



### కొండబిట్రగుంట ఆలయానికి 17 లక్షల రాబడి

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బోగోలు మండలం కొండబిట్రగుంటలో ఉన్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవా లయానికి ఇటీవల బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు సమ ర్పించిన హుండీ కానుకల ద్వారా 17,93,811 రూపాయలు రాబడి వచ్చింది. ఆలయ ఛైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, ఇఓ రాధాకృష్ణ, పాలకమండలి సభ్యులు లెక్కింపును పర్యవేక్షించారు.

### నెల్లూరులో ఆకట్టుకుంటున్న.. చేనేత వస్త్రప్రదర్శన

నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ అకాడమీలో ఈనెల 15 నుంచి చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభమైంది. రాష్ట్రంలోని పేరెన్నికగన్న ప్రాంతాలకు చెందిన అనేక రకాల చేనేత వస్త్రాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి.

### ఉచితంగా..'గాలికుంటు టీకాలు'

జిల్లాలో పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ఈ నెలాఖరు దాకా ఉచితంగా టీకాలు వేస్తామని పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ మహేశ్వరుడు తెలియజేశారు. అదే విధంగా, జిల్లాలోని 14 లక్షల మూగజీవాలకు నట్టల నివారణ టీకాలను ఏప్రిల్ మొదటివారం నుంచి వేస్తామని, పాడిరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ప్రియదర్శిని లయన్స్‌క్లబ్.. ఉచిత వైద్యశిబిరం

నెల్లూరులోని ప్రియదర్శిని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక గాంధీబొమ్మ కూడలి సమీపంలోని స్వతంత్రపార్కులో ఉచిత వైద్యశిబిరం నిర్వహించి పేదరోగులకు వైద్యపరీక్షలు చేశారు. షైనింగ్ స్మైల్ డెంటల్ క్లినిక్ డాక్టర్ మధులత సహకారంతో జరిగిన ఈ వైద్యశిబిరంలో క్లబ్ అధ్యక్షురాలు సువర్ణ శేషాద్రి, సభ్యులు, పలువురు వైద్యులు పాల్గొన్నారు.

### నెల్లూరు హౌసింగ్‌బోర్డు కాలనీలో చోరీ

నెల్లూరులోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఇటీవల చోరీ జరిగింది. కాలనీలోని రామ్‌ప్రసాద్‌శర్మ తన కుటుంబసభ్యులతో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా, వేకువజామున ఇంటి వెనుక ఉన్న తలుపు తెరిచి, ఇంట్లో ఉన్న రెండు సెల్‌ఫోన్లు, 16వేల రూపా యలను దొంగలు అపహరించుకుపోయారు. బాధితుల ఫిర్యా దుతో వేదాయపాళెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఉత్తరాలు రాయడంపై.. 19న తపాలాశాఖ పోటీలు

ఉత్తరాల రాత ప్రాధాన్యతపై మార్చి 19న తపాలాశాఖ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు నెల్లూరు డివిజనల్ తపాలా సూపరింటెండెంట్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలి పారు. నెల్లూరు నగరంలోని ప్రధాన పోస్టాఫీసు కార్యాలయం ప్రాంగణంలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

### విరువూరులో..9 మందికి కుక్కల కాటు

వరికుంటపాడు మండలంలోని విరువూరు గ్రామంలో కుక్కలు జనాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. ఈనెల 13వ తేది రాత్రి కుక్కలు దాడిచేసి 9 మందిని కరిచి ఆసుపత్రి పాలుచేశాయి. గాయపడిన వారిలో ఇద్దరు విద్యార్థులు కూడా ఉన్నారు. తీవ్రంగా గాయపడిన ప్రకాశం జిల్లా పామూరు ఆసుపత్రికి తరలించారు. మరికొందరు స్థానికంగా చికిత్స పొందుతున్నారు.

### కృష్ణారెడ్డిపల్లిలో.. పసుపురైతుల ఆందోళన

ఉదయగిరి మార్కెట్‌యార్డులో పసుపును కొనుగోలు చేయా లని కోరుతూ పసుపు పంటను సాగుచేస్తున్న రైతులు ఈ నెల 14న ఆందోళన చేపట్టారు. రైతుసంఘం నాయకుడు కాకు వెంకటయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో, మార్కెట్‌లో పసుపు తక్కువధర పలుకుతోందని, రైతులు నష్టపోకుండా మద్దతు ధరకు పసుపును కొనుగోలుచేయాలని రైతులు కోరారు.

### బుచ్చిలో..స్వచ్ఛ సర్వేక్షణ్

బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో ఈనెల 14 స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతి కమిషనర్ ఎల్.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పారిశుద్ధ్యం పట్ల ప్రజలకు అవగాహన కలిగించారు. తడి-పొడి చెత్తను వేరుచేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని ఇళ్ళ యజమానులకు సూచించారు. సకాలంలో ఇళ్ళపన్నులు చెల్లించాలని కోరారు.

## పంచాయతిరాజ్ వ్యవస్థలో మహిళల ప్రాధాన్యతపై..

# రాజ్యసభలో బీద మస్తాన్‌రావు ప్రశ్నలు

పంచాయతిరాజ్ వ్యవస్థలలో మహిళల ప్రాధాన్యతపై ఈనెల15న రాజ్యసభలో సభ్యులైన బీద మస్తాన్‌రావు పంచాయతి రాజ్‌శాఖ మంత్రిపై పలు ప్రశ్నలు సంధించారు. మహిళలకు 50శాతం రిజర్వేషన్లు ఉన్న రాష్ట్రాలలో ఖాళీగా ఉన్న మహిళల పంచాయితీరాజ్ సీట్ల శాతం 2019-20, 2020-21, మరియు 2021-22 ఆర్థిక సంవత్సరాల్లో ఎంత? ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ వ్యవస్థలలో 2019-2020, 2020-2021, 2021-2022 సంవత్సరాలలో ఎన్నికైన మహిళా ప్రతినిధుల సంఖ్య ఎంత?..అని ఆయన అడిగారు. కోవిడ్ అనంతరం ఎన్నుకోబడిన మహిళా ప్రతినిధుల సంఖ్య తగ్గుముఖం పట్టిందా? వివరాలేమిటని ప్రశ్నించారు. ఆ ప్రశ్నలకు పంచాయితీ రాజ్ మంత్రిత్వశాఖ రాష్ట్ర మంత్రి కపిల్ మోరేశ్వరపాటిల్ సమాధానమిస్తూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పంచాయతీలకు ఎన్నికలు 2014లో జరిగి, వాటి పదవీ కాలం 2019లో ముగిసిందని, రాష్ట్ర ఎన్నికల సంఘం పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం మార్చి 2020లో నోటిఫికేషన్ జారీచేసినప్పటికీ, కోవిడ్-19 మహమ్మారి పరిస్థితి కారణంగా ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాల్సి వచ్చిందని, 2019-20 నుండి 2020-21 వరకు ఎన్నికైన పంచాయతీలు లేవని, ఏప్రిల్ 2021లో రాష్ట్రంచే పంచాయతిరాజ్ సంస్థలకు ఎన్నికలు నిర్వహించబడ్డాయని పేర్కొన్నారు. దాని ప్రకారం 2021-22లో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నుకోబడిన మహిళా ప్రతినిధుల వివరాలు చెప్పారు. జడ్పిటిసి ఎన్నికలలో 660 స్థానాలకు 652 స్థానాలలో ఎన్నికల నిర్వహించగా 350మంది(53.68%) మహిళలు ఎన్నుకోబడ్డారని, అదేవిధంగా, ఎంపీటీసీ ఎన్నికలలో 10047 స్థానాలకు గాను 9703 స్థానాలలో ఎన్నికలు నిర్వహించగా 5670 మంది(58.43%) మహిళలను ఎన్నుకున్నారని తెలిపారు. 13371 గ్రామపంచాయతీలకుగాను 13097 పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించగా, 7434 పంచాయతీలలో(56.76%) మహిళలు ఎన్నుకోబడ్డారని, 134057 పంచాయతీ వార్డు మెంబర్లకుగాను 130962 వార్డులకు ఎన్నికలు నిర్వహించగా 72177 పంచాయతీ వార్డులలో (55.11%) మహిళలను ఎన్నుకున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో పైన తెలిపిన విధంగా 2019 నుండి మొత్తం 158135 సీట్లకు గాను 154414 సీట్లలో ఎన్నికలు నిర్వహించగా, 85634 సీట్లలో(55.45%) మహిళలను ఎన్నుకున్నారని మంత్రి వివరించారు.



## రాష్ట్రపతి విందులో పాల్గొన్న బీఎంఆర్

భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము పార్లమెంటు సభ్యుల గౌరవార్థం మార్చి 15న న్యూఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లో విందు ఏర్పాటుచేసి, లోక్‌సభ-రాజ్యసభ సభ్యులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భారత ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకులు విజయసాయిరెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు మరియు ఆంధ్రప్రదేశ్ నుండి ఎన్నిక కాబడిన రాజ్యసభ మరియు లోకసభ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ళు దొరికారు



కలువాయి మండలంలోని దాచూరు-పెరంకొండ గ్రామాల మధ్యలో ఉన్న దాసరిపల్లి సమీపంలో రహస్యంగా స్థావరం ఏర్పాటు చేసుకుని పేకాట ఆడుతున్న 10 మంది పేకాటరాయుళ్ళను ఈనెల 12న పోలీసులు అరెస్ట్ చేశారు. కలువాయి ఎస్ఐ మహేంద్ర ఆ పేకాటస్థావరంపై దాడిచేసి, వారిని అదుపులోకి తీసుకుని, 48,500 రూపాయలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

# పొత్తుల పాట్లు.. సర్దుబాట్ల ఫీట్లు!

(మొదటి పేజీ తరువాయి)

బాగా బలహీనంగా ఉంది. పైపెచ్చు లోకేష్ చేస్తున్న పాదయాత్ర అంతంతమాత్రంగా ఉండడంతో ప్రజలలో తాను ఊహించిన స్థాయిలో తెలుగుదేశానికి ఆదరణ లేదన్న విషయం బాబుకి అర్థమైపోయిందంటున్నారు విశ్లేషకులు. అందుకోసమే ఇప్పుడు పొత్తులకు పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఇందుకోసం పవన్‌కళ్యాణ్‌ని మధ్యవర్తిగా వాడుకునే ఆలోచనలో కూడా బాబు ఉన్నట్లు వార్త. అయితే బీజేపీ కూడా తెలుగుదేశంకు గల ఈ బలహీనతను సొమ్ము చేసుకోవాలనే ఆలోచనలోనే ఉన్నట్లు ఢిల్లీ వర్గాల సమాచారం. ఇప్పటికే మధ్యవర్తి ద్వారా 25 లోకసభ స్థానాలలో తమకు 10 స్థానాలు కేటాయిస్తే, టీడీపీతో 'పొత్తు' విషయం పరిశీలిస్తామని వాళ్ళు ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. ఇదే నిజమైతే, లోక్‌సభకు పోటీ చేయగల 'స్థాయి' కలిగిన పదిమంది నేతలు ఆంధ్ర బీజేపీలో ఉన్నారా..? అనేది కూడా అనుమానమే అని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

శాసనసభ స్థానాలపై తమకు పెద్దగా పట్టింపు లేదని, అయిదారు స్థానాలు ఇచ్చినా సర్దుకుపోతామని బీజేపీ నేతలు అంటున్నారని కూడా వినికిడి. ఇప్పటికే బీజేపీతో దోస్తీ చేస్తున్న జనసేన శాసనసభ స్థానాల విషయం చూసుకుంటుందిలే అన్నది వారి ధీమా. కేంద్రానికి సంబంధించినంతవరకు లోక్‌సభ స్థానాలే వాళ్ల ప్రయారిటీ.

అదే సమయంలో, జనసేనకు 75స్థానాలు కావాలని పవన్‌కళ్యాణ్ బేరం పెట్టినట్టు తెలిసింది. అయితే, ఈ సంఖ్యను మళ్ళీ 40కి కుదించినట్టు జనసేనవర్గాలలోనే ప్రచారం జరుగుతోంది. కానీ, ఇరవై (20) స్థానాలు మాత్రమే జనసేనకు కేటాయించడానికి చంద్రబాబు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నట్లు అభిజ్ఞవర్గాల భోగట్టా. దీనికి, పవన్‌కళ్యాణ్ 'ససేమిరా' అంటున్నారని కూడా ఆ పార్టీ వర్గాలే లీకులు ఇస్తున్నాయి. గతానుభవాలను దృష్టిలోపెట్టుకుని తమ జుట్టు బాబు చేతిలో పెట్టకూడదన్న దృఢ నిశ్చయంతో పవన్ కళ్యాణ్ ఉన్నాడని అంటున్నారు. అలాగే, 5 లోక్‌సభ స్థానాలు జనసేన అడుగుతున్నట్టు తెలిసింది. కానీ, టీడీపీ మాత్రం మూడైతే ఓకే అని అంటోందని అంటున్నారు. ఈ నేపథ్యంలో జనసేన, బీజేపీతో టీడీపీకి 'పొత్తు'కుదురుతుందా..? లేదా..?? అనే విషయంలో స్పష్టత రావడంలేదు. పొత్తులకు సంబంధించి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. జనసేనను నెలకొల్పిన పదేళ్ల తరువాత కూడా, స్వతంత్రంగా ఎన్నికల్లో పోటీచేయలేని 'నిస్సహాయ'స్థితిలో పవన్ కళ్యాణ్ ఉన్నారనేది స్పష్టం. మచిలీపట్టణంలో జరిగిన సభలో ఆయన ఆ విషయం విస్పష్టంగా ప్రకటించారు కూడా. వైసీపీ వ్యతిరేక ఓటు చీలనీయం అని ఆయన పదేపదే చెప్తూనే ఉన్నారు. 'పొత్తు'లు లేకుండా ఎన్నికలను ఎదుర్కోలేని తెలుగుదేశం పార్టీ కూడా ఓ వైపు దోస్తీ చేతులు చూపుతూనే మరోవైపు జనసేన ఆశించినన్ని స్థానాలు కేటాయించడానికి ఇష్టపడడం లేదు. రేపు గెలిచిన తరువాత, తమపై జనసేన పెత్తనం వీలైనంత కనీస స్థాయిలో ఉండాలనేది తెలుగుదేశం వ్యూహంగా కనపడుతోందని పరిశీలకులు అంటున్నారు. అదే సమయంలో వచ్చేది టీడీపీ ప్రభుత్వం అని కాకుండా టీడీపీ, జనసేన ప్రభుత్వంగా ఉండాలన్నది జనసేన ఆలోచనగా ఉంది. దీంతో, 'పొత్తు' ఒక కొలిక్కి రావడం లేదు అని అంటున్నారు.

అయితే జనసేన, బీజేపీ గనుక మరీ చెట్టెక్కి కూర్చుంటే ఒంటరిగానే ఎన్నికలకు వెళ్ళాలి అనే ఆలోచన కూడా టీడీపీ అధిష్టానంలో బలంగానే ఉందని కొన్ని టీడీపీ వర్గాలు అంటున్నాయి. "ఓడిపోతే ఓడిపోతాం. మరీ 23 అయితే రావు కదా! 60... 70 స్థానాలు ఖాయంగా వస్తాయి. పోనీ ఇంకో ఐదేళ్లు ప్రతిపక్షంలో ఉందాం. అప్పుడు వైసీపీ విశ్వరూపం ప్రజలకు మరింతగా తెలిసివస్తుంది." అనే చర్చలు కూడా టీడీపీ ముఖ్య నేతల్లో సాగుతున్నాయంటున్నారు. అయితే ఈసారి తెలుగుదేశం అధికారంలోకి రాకపోతే ఇక భవిష్యత్తులో వచ్చే అవకాశమేలేదని ఆ పార్టీ సీనియర్ నేతలే చెవులు కొరుక్కోవడం ఇక్కడ గమనార్హం. బీజేపీ మరోసారి కేంద్రంలో అధికారంలోకివస్తే ఈసారి ఖచ్చితంగా తమ దృష్టి ఆంధ్రా పైన పెడతారన్నది వారి అభిప్రాయం. రాష్ట్రంలో తీవ్ర అసంతృప్తితో ఉన్న రెడ్డి సామాజిక వర్గాన్ని ఆకర్షించే ప్రయత్నంలో భాగంగా మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డిని ఆంధ్రా బీజేపీ తెరపైకి తేవడం భవిష్యత్ వ్యూహమే అంటున్నాయి రాజకీయ వర్గాలు. ఈసారి అధికారంలోకి రాకపోతే ఆంధ్రాలో వైసీపీకి ప్రత్యామ్నాయంగా ఎదిగే శక్తి తెలుగుదేశం కోల్పోతుందని ఆ పార్టీ వర్గాలే పేర్కొంటున్నాయి.

బీజేపీ వ్యవహారం పక్కనపెడితే, జనసేన తమతో కలిసి వస్తేనే వారికీ భవిష్యత్ అన్న అభిప్రాయం టీడీపీలో బలంగా ఉంది. తమను కాదని, స్వతంత్రంగా బరిలోకి దిగితే (బీజేపీని కలుపుకుని) 2019 నాటి అనుభవాలనే జనసేన రుచి చూడాల్సిన పరిస్థితుల్లో పడిపోతుందని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి. బీజేపీతో ఉన్న పవర్‌స్టార్ ఆ పార్టీతో మంతనాలు జరిపి, బాబుతో సయోధ్య కుదిర్చినా ఆశ్చర్యపోనవసరం లేదన్న మాటలు కూడా విశ్లేషకుల నుండి వినపడుతున్నాయి. రాజకీయాలలో ఎత్తులు, పైఎత్తులు సర్వసాధారణం. ఎన్నికల కోడి కూసేవరకు పొత్తులు జిత్తులపై స్పష్టత రాదు. అప్పటివరకూ ఈ అనిశ్చితస్థితి కొనసాగాల్సిందే..!




## విఘ్నేశ్వరుని ఆలయంలో..'సంకటహర చతుర్థి'

నెల్లూరు వేదాయపాళెంలోని మహాత్మాగాంధీనగర్‌లో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో కొలువైవున్న శ్రీ వరసిద్ధి విజయ వినాయకస్వామికి ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఇటీవల ప్రత్యేక పూజలు జరిగాయి. సంకటహర చతుర్థిని పురస్కరించుకుని చేసిన ఈ విశేషపూజల్లో స్థానిక భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త వెంకటేశ్వర్లు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాఘవేంద్ర, సుబ్బరామరాజు, వేణుబాబు తదితరులు ఈ పూజలను పర్యవేక్షించారు.



## ముక్కాల వేడుకలో ముఖ్యమంత్రి

నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా) ఛైర్మెన్ ముక్కాల ద్వారకనాథ్ అన్న ముక్కాల వ్యాసప్రసాద్ - లేట్ కనకదుర్గల కుమార్తె **ఉషశ్రీ - ప్రశాంత్‌కుమార్** (విజయవాడ వాస్తవ్యులు నాగభూషణం - రాధికల కుమారుడు)ల వివాహం మార్చి 9వతేది నెల్లూరులో ఘనంగా జరిగింది. అనంతరం మార్చి 12 ఆదివారం విజయవాడలో జరిగిన వీరి రిసెప్షన్ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హాజరై కొత్త దంపతులను ఆశీర్వదించారు. నవ వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



# ఎన్నికల సంఘం మరో అఫిడవిట్ ప్రవేశ పెట్టాలి!

ఆమె పేరు నవ్య. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబాబాద్ జిల్లా, స్టేషన్ ఘనాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని జానకిపూర్ అనే గ్రామ పంచాయతీకి ఆమె ప్రజలెన్నుకున్న సర్పంచ్. బీఆర్ఎస్ పార్టీ నేత.

ఆ స్టేషన్ ఘనాపూర్ నియోజకవర్గ ఎం.ఎల్.ఏ కూడా బీఆర్ఎస్‌కు చెందిన నేతే. తెలంగాణ పూర్వపు ఉప ముఖ్యమంత్రి కూడా. ఆయన, ఆయన అనుచరులు తనను లోబర్చుకోడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని ఆమె... బహిరంగంగా... పక్కన భర్తను కూర్చోపెట్టుకుని... మీడియా ముందు కన్నీటి పర్యంతం అయ్యారు. తానే కాదు, అనేక మంది మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు కూడా వారి దుశ్చర్యలను తట్టుకోలేక విలవిల్లాడుతున్నారని ఆమె అన్నారు.

ఆ ఎంఎల్‌ఏ పేరు రాజయ్య.

ఇలాంటి ఆరోపణలు వెల్లువెత్తిన సందర్భాలలో... ఆరోపణలకు గురైనవారు స్పందించే రీతిలోనే రాజయ్య కూడా ముందు స్పందించారు.

తనపై రాజకీయ కుట్రలు జరుగుతున్నాయని, తనకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్చుకోలేక ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆయన అన్నారు. త్వరలోనే నిజాలు బయటికి వస్తాయి. కుట్రలను తిప్పికొడతా అని అన్నారు. ఆంధ్రలో కూడా ఆ మధ్య ఓ ప్రజాప్రతినిధిపై టీవీల్లో ఈ తరహా ఆరోపణలు వస్తే... ఆయన కూడా ఇలాగే స్పందించారు. ఈ స్పందనను మించిన డిఫెన్స్ ఏమి ఉంటుంది? ఇక, ఆ తరువాత దులపరించుకు తిరగడం మామూలే.

జానకిపూర్ సర్పంచ్ నవ్య బయటికి వచ్చారు గనుక, రాజయ్య వివరణ ఇచ్చుకోవలసి వచ్చింది. 'వివరణ'తో రాజయ్య బయటపడలేదు. తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి.. రాజయ్యపై సర్పంచ్ నవ్య చేసిన ఆరోపణలను దర్యాప్తు చేసి, నివేదిక అందచేయమని తెలంగాణ డీజీపీని ఆదేశించారు. దాంతో, రాజయ్య దిగివచ్చారు. నవ్యకు క్షమాపణలు చెప్పారు. ఇలా, బయటకు రాని 'యవ్వారాలు' సవాలక్ష.

పంచాయతీ వార్డు మెంబెర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీపీలు, జెడ్‌పీటీసీలు, జెడ్‌పీపీ ఛైర్‌పర్సన్‌లు, ఎంఎల్‌ఏలు, ఎంపీలు, ఎంఎల్‌సీలు, మంత్రులు, ముఖ్యమంత్రులు, వారివారి స్థాయిల్లో వారి అనుచరులు, అనుచరుల కింద 'పనులు' చేసే, చేయించే ఉపానుచరులు, వారి మద్దతుదారులకు ఈ వివాహేతర లైంగిక కార్యకలాపాలు చాలా సందర్భాలలో రొటీన్‌నైపోతున్నాయి. వీటి ఫలితంగానే రాజకీయ పదవులు, పోస్టింగ్‌లు, ప్రమోషన్‌లు, బదిలీలు, ముడుపులు, మర్డర్‌లు, దౌర్జన్యాలు, కబ్జాలు, దొమ్మీలు... సమస్త అరాచకాలూ జరిగిపోతుంటాయని పలువురు అంటుంటారు. కొన్ని బయటకు కనపడతాయి. కొన్ని అదృశ్యంగా ఉంటాయి.

వివాహేతర... లేదా.. (పెళ్లికాని వారైతే) అక్రమసంబంధాలు కలిగి ఉండడం ఐపీసీలో శిక్షింపతగిన నేరం కాదు. కానీ, సమాజం ఒక్క శాతం కూడా వీటిని హర్షించదు. ఏహ్యాభావంతో చూస్తుంది. అందుకే రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయే భర్తల్నిగానీ, భార్యల్నిగానీ టీవీఛానళ్ళు వందేసిసార్లు రిపీటెడ్‌గా చూపిస్తుంటాయి. దొరికినవారు సిగ్గుతో చచ్చిపోతుంటారు. తలెత్తుకుని సమాజంలో మునుపటి వలె తిరగలేరు. ఆత్మన్యూనతా భావంతో కుంచించుకుపోతుంటారు. దొరకకపోతే మాత్రం కింగ్‌లూ, క్వీనులే.

మన ప్రజాస్వామిక ప్రక్రియలో నాలుగు ప్రధానాంగాలు ఉన్నప్పటికీ, పొలిటికల్ ఎగ్జిక్యూటివ్ అతి ప్రధానమైంది. గ్రామ పంచాయతీ స్థాయి నుంచి, పార్లమెంట్ స్థాయి వరకు వారే శాసనాలు చేస్తారు. అధికార యంత్రాంగాన్ని శాసిస్తారు. ఉన్నత స్థాయి జ్యూడిషియరీని నియమిస్తారు. సమాజపు గమనాన్ని తమకు నచ్చిన రీతిలో నియంత్రిస్తారు.

భారత ప్రజాస్వామిక అంగాలు నాలుగింటిలో మూడు అయిన జ్యుడీషియరీ, అడ్మినిస్ట్రేటివ్, ఫోర్త్ ఎస్టేట్ రంగాల్లో పని చేయడానికి కొన్ని అర్హతానర్హతలు ఉన్నాయి. కానీ, ఈ మూడు రంగాలను నియంత్రించే రాజకీయ విభాగానికి మాత్రం ఏ రకమైన అర్హతానర్హతలు లేవు.

అందువల్లనే ఇప్పుడు రాజకీయాలలో మనం అనునిత్యం చూస్తున్న విచ్చలవిడితనం, అరాచకం, అక్రమ లైంగిక సంబంధాలు, వివాహేతర యవ్వారాలు యధేచ్ఛగా జరిగిపోతున్నాయి.

రాజకీయం నీడలో ఉండే ఎగ్జిగ్యూటివ్, జుడీషియరీ, మీడియాకు ఈ అవలక్షణాలు పాకకుండా, ఈ రంగాలను కలుషితం చేయకుండా ఎలా ఉంటాయి?

అందుకే, అవి ఈ రంగాలనూ చేయాల్సినంతగా కలుషితం చేసేశాయి. చేస్తున్నాయి. అడ్డుకట్ట అనేది ఒకటి వేయకపోతే, ఇక ముందూ కలుషితం చేస్తూనే ఉంటాయి.


అక్రమ సంబంధాలు, వివాహేతర లైంగిక సంబంధాల విచ్చలవిడితనంతో రాజకీయ రంగం కలుషితమైపోయిన తరువాత, దాని అజమాయిషీలో పనిచేసే పోలీసు, ప్రభుత్వ అధికార యంత్రాంగం కలుషితమైపోయిన తరువాత, అరాచకం... విచ్చలవిడితనం... భోపాల్ విషవాయువులా సమాజాన్ని నిలువెల్లా ఆవహించిన తరువాత.. మనం ఒక నాగరిక సమాజంగా మనగలుగుతామా?

విద్యారంగం కలుషితం. వైద్యరంగం కలుషితం. ప్రభుత్వ ఉన్నతాధికార యంత్రాంగ విభాగం కలుషితం. పోలీసు వ్యవస్థ కలుషితం. ప్రభుత్వ గెజిటెడ్, నాన్ – గెజిటెడ్ ఉద్యోగ రంగం కలుషితం. జుడిషియరీ కలుషితం.

ఒక్క రాజకీయ రంగం కలుషితం కావడం వల్ల, దాని కింద.... దాని అజమాయిషీలో పనిచేసే సమస్త రంగాలు కలుషితమైపోయాయి. ఏ విషయంలోనూ ఉచ్ఛనీచాలు అనేవి లేకుండాపోయాయి. అందువల్లే, సమాజంలో నైతిక విలువలు అనేవి లేకుండాపోయాయి.

అయితే... తప్పు ఎక్కడ?

అయితే, ఈ విచ్చల విడితనానికి తప్పు రాజకీయ




నాయకుల్లో లేదు. రాజకీయ వ్యవస్థ కింద పనిచేసే ఎగ్జిగ్యూటివ్, జుడీషియరిలో పనిచేసే వ్యక్తుల్లో లేదు.

వ్యవస్థ నిర్మాణంలో ఉంది. వ్యవస్థ నిర్వహణలో ఉంది. వ్యవస్థ కట్టుబాట్లలో ఉంది.

ఉదాహరణకు పశ్చిమ దేశాల్లో వ్యవస్థలు కొన్ని కఠినమైన కట్టుబాట్లకు లోబడి పని చేస్తాయి. చిన్న నేరపూరిత చర్యకు సైతం అత్యంత కఠినమైన జైలు శిక్షలు ఉంటాయి. మనకు ఆ బాదరబందీ లేదు.

ముఖ్యంగా రాజకీయ నాయకుల నుంచి 'క్లీన్ నడవడిక'ను పశ్చిమ దేశాల వారు ఆశిస్తారు. మనకు ఆ 'పట్టింపు'లేదు. ఏదైనా అక్రమ సంబంధం ఓ నాయకుడికి చోటు చేసుకున్నట్టు అమెరికాలో బయటపడితే, ఇక ఆ నాయకుడు రాజకీయ సన్యాసం తీసుకోవడం తప్ప, మరో మార్గం లేదు. మనకేమో 'స్టేటస్ సింబల్'.

అమెరికా 42వ అధ్యక్షుడిగా 1993 నుంచి 2001 వరకు పనిచేసిన బిల్‌క్లింటన్ ఉదంతమే నైతిక విలువలకు అమెరికా ప్రజలు ఎంతటి విలువ ఇస్తారో చెప్పడానికో సజీవ ఉదాహరణ.

లెవిన్స్ కీ(Monica Lewin sky) అనే ఓ 22ఏళ్ళ చిన్నది, క్లింటన్ అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లో ఆఫీసు సహాయకురాలిగా పని చేసేది. బిల్‌క్లింటన్, అమెరికా అధ్యక్షుడిగా పనిచేసే కాలంలోనే 1996లలో ఆమెతో అక్రమ / వివాహేతర సంబంధం పెట్టుకున్నారనే వార్తలు అమెరికా మీడియాలో ఒక్కసారిగా గుప్పుమన్నాయి. అమెరికన్లు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. తమ అధ్యక్షుడు ఇటువంటి పనులకు పాల్పడ్డారా అంటూ ఆగ్రహావేశాలకు లోనయ్యారు. యావత్ప్రపంచానికి నాయకత్వం వహించే అమెరికా అధ్యక్షుడు ఇటువంటి తప్పుడుపని చేయడమేంటి అంటూ అమెరికన్ ప్రజలు బిల్‌క్లింటన్‌పై విమర్శల వర్షం కురిపించారు.

చివరకు, 1998 జనవరి 26న ఆయన అమెరికన్ ప్రజల ముందుకు వచ్చి 'మిస్ లెవిన్ స్కీ అనే ఆవిడతో నాకు అక్రమ సంబంధం ఏమీ లేదు' అని అబద్ధం ఆడారు. దీంతో, వళ్ళు మండిన లెవిన్ స్కీ, మీడియా ముందుకువచ్చి "బిల్ క్లింటన్‌తో సంబంధం ఉన్న మాట నిజమే. 1995 నుంచి 1997 మధ్య మేము 9సార్లు లైంగికంగా కలుసుకున్నాం." అని ప్రకటించింది. అమెరికన్ సమాజం ఒక్కసారిగా నిశ్చేష్టురాలై బిగుసుకుపోయింది.

బిల్ క్లింటన్ ఆ పదవికి పనికి రాడంటూ... ఆయన పదవీచ్యుతికి అమెరికా ప్రతినిధుల సభ, సెనేట్ ప్రొసీడింగ్స్ మొదలుపెట్టాయి. ప్రతినిధుల సభ క్లింటన్ ఇంపీచ్మెంట్‌ను ఆమోదించింది గానీ, సెనేట్ తిరస్కరించింది. క్లింటన్... చావు తప్పి, కన్ను లొట్టబోయిన చందంగా బయటపడ్డారు.

ఇదంతా దేనికి అంటే ఆవిడతో తనకు సంబంధం లేదని అమెరికా ప్రెసిడెంట్ హోదాలో అసత్యం ఆడినందుకు. అక్రమ సంబంధాల కారణంగా పదవీచ్యుతులైన అమెరికన్ సెనేటర్లు, ఉన్నతాధికారులు ఎందరో ఉన్నారు. మనకు అటువంటి పట్టింపు ఒక్క శాతం కూడా లేదు.

ఒక్కసారి అమెరికా పరిస్థితులతో పోల్చిచూస్తే.... మన సమాజం గంగా నదిలా కనిపిస్తుంది. శవాలు, పరిశ్రమల నుంచి విడుదలయ్యే కాలుష్యాలతో... కైలాసానికి వెళ్లినంత పుణ్యం కదాని... గంగా జలం కొంచెం నోట్లో పోసుకుంటే.. నిజంగానే బొందితో కైలాసం వెళ్లిపోవడమే! సరిగ్గా మన సమాజ గమనం తీరు అలా ఉంది.

గంగా నది ప్రక్షాళనకు నడుంబిగించిన ప్రధాని నరేంద్ర మోడీ సమాజంలోని మహాకాలుష్య ప్రక్షాళనను వదిలేసినట్టు కనపడుతోంది. రాజకీయ కాలుష్యాన్ని ప్రక్షాళన చేస్తే, మిగిలిన రంగాలు సరైన మార్గంలోకి వస్తాయి.

రాజకీయ కాలుష్యాన్ని నివారించడానికి తొలి అడుగు – రాజకీయ రంగంలో వివాహేతర/ అక్రమ సంబంధాలకు తావు లేకుండా చేయడమే.

ఎన్నికల సంఘం చేతుల్లోనే బటన్...!

ఇందుకు అవసరమైన బటన్ భారత ఎన్నికల సంఘం చేతుల్లో ఉంది. ఆ బటన్‌ను అది నొక్క గలిగితే, భారత రాజకీయ చిత్రం సమూలంగా మారిపోతుంది. ఓ కొత్త దృశ్యం ఆవిష్కృతమవుతుంది.

- ఇప్పుడు అభ్యర్థుల ఆస్తిపాస్తులకు సంబంధించిన అఫిడవిట్ ఒకటి ఉంది.
- అలాగే అభ్యర్థుల నేరచరిత్ర, కేసులకు సంబంధించిన వివరాలతో ఒక అఫిడవిట్‌ను అభ్యర్థులు దాఖలు చేయాలి.
- ఈ రెండు అఫిడవిట్లను ఏ ప్రయోజనం కోసం నామినేషన్ సమయంలో దాఖలుచేయమని భారత ఎన్నికల సంఘం అభ్యర్థులను నిర్దేశిస్తుందో.... ఆ ప్రయోజనాన్ని మరింత పటిష్టంగా ఓటర్ల దృష్టికి తీసుకురావడానికి, మరో అఫిడవిట్‌ను ప్రవేశపెట్టాలి.
- నామినేషన్ వేసే అభ్యర్థి, ఇతర అఫిడవిట్లతో పాటు, తనకు గతంలో వివాహేతర/ అక్రమ లైంగిక సంబంధాలు లేవు అని అఫిడవిట్ దాఖలు చేయాలి.
- ఎన్నికైన తరువాత, ఈ అఫిడవిట్‌ను ఎవరైనా ఓటర్ కోర్టులో సవాలు చేసి, సందేహాతీతంగా రుజువుచేయగలిగితే, న్యాయస్థానమే ఆ ఎన్నికను రద్దు చేస్తుంది.
- ఎవరూ కూడా తనకు వివాహేతర/ అక్రమ సంబంధం గతంలో ఉన్నదని అంగీకరించరు.
- ఎన్నికల్లో పోటీ చేయాలి అనుకునేవారు చాలా జాగ్రత్తగా వ్యవహరించవలసిన పరిస్థితులు ఏర్పడతాయి. ఒక నైతిక ప్రవర్తనకు ఈ అఫిడవిట్ శ్రీకారం చుడుతుంది.

రాజకీయాలలో ఈ మార్పు, మిగిలిన అన్ని రంగాలనూ ప్రభావితం చేస్తుంది. ఫలితంగా సమాజంలో నేర స్వభావం బాగా తగ్గుముఖం పడుతుంది. విచ్చలవిడితనానికి అడ్డుకట్టపడుతుంది. అరాచకం ఆవిరైపోతుంది.

గంగా నది ప్రక్షాళనకు నరేంద్ర మోడీ నడుం బిగించినట్టే.. సమాజ ప్రక్షాళనకు కూడా సమాజ శ్రేయస్సును కోరేవారు నడుంబిగించాలి.

ఇటువంటి అఫిడవిట్ ఒకదాన్ని ప్రవేశపెట్టాల్సిన తక్షణావశ్యకతను ఎన్నికల సంఘం దృష్టికి తీసుకురావాలి.

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

# ధన్యవాదాలు



మార్చి 10, 2023న మాంగల్యబంధంతో
ఆలుమగల అనుబంధాన్ని ముడివేసుకున్న
మా చిన్నారులు

## సాయి రోహిత్ - లక్ష్మీ రోహిత

కళ్యాణ వైభవానికి విచ్చేసి
మనసారా దీవించిన ప్రతి ఒక్కరికీ మా
హృదయపూర్వక ధన్యవాదాలు.

**కే.వి.రత్నం - శ్రీమతి పద్మావతి**
**కే.వేణుగోపాల్ - శ్రీమతి రమ**
**కే.కృష్ణకిషోర్ - శ్రీమతి వాసంతి**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com